జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php

ప్రజాపాలన

నిజాయితీ, నిబద్ధతతో జర్నలిస్టుగా పనిచేయాలనుకొంటున్నారా?

మీ ఏరియాలోని ప్రజల సమస్యలను మీ కలం ద్వారా ప్రభుత్వదృష్టికి తీసుకువెళ్లాలి అనుకుంటున్నారా ?ఇంకెందుకు ఆలస్యం మీ ఏరియాకు మీరే రిపోర్టర్... రండి ..ప్రజాపాలన దినపత్రిక మీకు అవకాశం కల్పిస్తుంది

వివరాలకు సంప్రదించండి 8886022523

సంపుటి 5 సంచిక 354 | హైదరాబాద్, అక్టోబరు 15 శనివారం 2022 | 8 పేజీలు | వెల : 5.00



# అంతుచిక్కని వ్యూహం

## హస్తినలోనే కేసీఆర్ మకాం..

న్యూఢిల్లీ, : తెలంగాణ రాష్ట్ర సమితిని జాతీయస్థాయిలో విస్తరించేందుకు వీలుగా భారత్ రాష్ట్ర సమితిగా పేరు మార్చిన తర్వాత తొలిసారిగా ఢిల్లీ చేరుకున్న ఆ పార్టీ అధినేత, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు ఎవరికీ అంతుచిక్కనిరీతిలో వ్యవహరిస్తున్నారు. తొలి రెండ్రోజులు పార్టీ అద్దె భవనం, నిర్మాణంలో ఉన్న సొంత భవనాలను సందర్శించిన ఆయన, గురు, శుక్రవారాల్లో తన అధికారిక నివాసానికే పరిమితమయ్యారు. దేశవ్యాప్తంగా పలు పార్టీల నేతలు ముందుకొస్తున్నారని, బీఆర్ఎస్‌తో కలిసి పనిచేసేందుకు ఆసక్తి చూపుతున్నారని చెప్పిన కేసీఆర్.. ఢిల్లీలో ఏ పార్టీ నేతలనూ కలవకుండా ఇంటికే పరిమితం కావడంతో ఆయన వ్యూహాలేంటో ఎవరికీ అంతుచిక్కడం లేదు. వివిధ రాజకీయ పార్టీల నేతలతో పాటు పలు రంగాల ప్రముఖులను కలిసి చర్చలు జరుపుతారని అందరూ భావించారు.పార్టీకి సంబంధించిన నేతలు ఒకరిద్దరు ఆయన్ను కలవడం మినహా మరెటువంటి రాజకీయ సందడి కనిపించలేదు. (మిగతా 2లో..)

# ఉప్పొంగుతున్న మూసీ

## జంట జలాశయాలకు భారీ వరద..



హైదరాబాద్ : హైదరాబాద్ జంట జలాశయాలు ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌లోకి వరద నీటి ప్రవాహం కొనసాగుతున్నది. విస్తారంగా కురుస్తున్న వర్షాలతో ఎగువ ప్రాంతాల నుంచి గడిచిన కొన్ని రోజులుగా జలాశయాల్లోకి వరద నీరు భారీగా వచ్చి చేరుతుంది. ఉస్మాన్‌సాగర్‌కి 900 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. దీంతో ప్రాజెక్టు నాలుగు గేట్లు 4 అడుగుల మేర ఎత్తి 1836 క్యూసెక్కుల నీటిని మూసీలోకి వదులుతున్నారు.హిమాయత్ సాగర్‌కు ఎగువ నుంచి 2,000 క్యూసెక్కుల నీరు వస్తుండగా, మూడు గేట్లను రెండు అడుగుల మేర ఎత్తి, 2,060 క్యూసెక్కుల నీటిని మూసీలోకి వదిలారు. ఈ క్రమంలో మూసీ పరివాహక ప్రాంతాల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నట్లు జలమండలి అధికారులు పేర్కొన్నారు.

# బీజేపీలోకి బూర!

## హస్తినలో మంతనాలు





న్యూఢిల్లీ, : టీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ భారతీయ జనతా పార్టీలో చేరనున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఇప్పటికే ఢిల్లీ చేరుకున్న ఆయన, బీజేపీ పెద్దలతో మంతనాలు సాగిస్తున్నట్టు సమాచారం. మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గం ఉపఎన్నికల్లో పోటీచేయాలని భావించినప్పటికీ, టీఆర్ఎస్ నాయకత్వం చివరకు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డికే మొగ్గు చూపడంతో బూర నర్సయ్య గౌడ్ మనస్తాపానికి గురయ్యారు. నాయకత్వం ఆయనతో మాట్లాడి బుజ్జగించినట్టు కూడా వార్తలొచ్చాయి. ప్రభాకర్ రెడ్డి నామినేషన్ కార్యక్రమంలోనూ బూర నర్సయ్య గౌడ్ పాల్గొన్నారు. కానీ అకస్మాత్తుగా ఆయన ఢిల్లీకి పయనమవడం రాజకీయవర్గాల్లో చర్చకు దారితీసింది. శుక్రవారం రాత్రి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు (మిగతా 3లో..)

## మునుగోడు ఉప ఎన్నికకు...

# ముగిసిన నామినేషన్ల పర్వం




నల్లగొండ : మునుగోడు ఉప ఎన్నికకు నామినేషన్ల పర్వం ముగిసింది. వందకు పైగా నామినేషన్లు దాఖలైనట్లు అధికారులు పేర్కొన్నారు. ఇవాళ ఒక్కరోజే 50కి పైగా నామినేషన్లు దాఖలైనట్లు తెలుస్తోంది. రేపు, ఎల్లుండి నామినేషన్ల పరిశీలన జరగనుంది. నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ అక్టోబర్ 17.ఉప ఎన్నిక నేపథ్యంలో ఆయా పార్టీలు జోరుగా ప్రచారం చేస్తున్నాయి. నవంబర్ 3న పోలింగ్ నిర్వహించనున్నారు. 6న ఓట్ల లెక్కించి, ఫలితాలను విడుదల చేయనున్నారు. ఇక టీఆర్ఎస్ పార్టీ తరపున కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, బీజేపీ నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, కాంగ్రెస్ తరపున పాల్వాయి స్రవంతి రెడ్డి బరిలో ఉన్నారు. ఈ ముగ్గురి మధ్య ప్రధాన పోటీ ఉంది.2018 ఎన్నికల సమయంలో మునుగోడులో మొత్తం 33 మంది నామినేషన్లు దాఖలు చేశారు. అయితే చివరగా 15 మంది మాత్రమే బరిలో ఉన్నారు. అయితే ఇది ఉపఎన్నిక కావడంతో నామినేషన్లు పెద్ద సంఖ్యలో దాఖలయ్యాయి.

## హైదరాబాద్ లోని పలు

# షాపింగ్స్ మాల్స్‌పై ఐటీ దాడులు







హైదరాబాద్ : హైదరాబాద్ లో పలు చోట్ల ఐటీ దాడులు కొనసాగుతున్నాయి. ఆర్ఎస్ బ్రదర్స్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్, బిగ్ సీ, లాట్ మొబైల్ షోరూమ్స్ లో ఐటీ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. రియల్ ఎస్టేట్ లో పెట్టిన పెట్టుబడులు, వార్షిక ఆదాయ లెక్కలపై ఆరా తీస్తున్నారు. లాభాల్లో ఉన్న కంపెనీలను నష్టాల్లో చూపించి.. నిధులను వేరే సంస్థల్లోకి మళ్లించినట్లు పలు మాల్స్ పై పెద్ద ఎత్తున ఆరోపణలు ఉన్నాయి. ఆర్థిక లావాదేవీలపైనా ఐటీ అధికారుల దగ్గర కీలక సమాచారం ఉన్నట్లు తెలుస్తోంది. ఒక సంస్థ ద్వారా హానర్ రియల్ ఎస్టేట్ లో ఆర్ఎస్ బ్రదర్స్ యాజమాన్యం భారీగా పెట్టుబడులు పెట్టినట్లు చెబుతున్నారు. ఇటీవల ఫినిక్స్, వాసవి కన్ స్ట్రక్షన్స్ తో పాటు వాటి అనుబంధం సంస్థల్లోనూ సోదాలు చేయగా.. హానర్ రియల్ ఎస్టేట్ లావాదేవీలు బయటపడ్డాయి. హానర్ కంపెనీతో ఆర్ఎస్ బ్రదర్స్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్, బిగ్ సీ, లాట్ మొబైల్స్ (మిగతా 2లో..)



## మునుగోడును దత్తత తీసుకుంటానని కేటీఆర్ డ్రామాలు : రేవంత్ రెడ్డి

నల్గొండ:మునుగోడును దత్తత తీసుకుంటానంటూ మంత్రి కేటీఆర్ డ్రామాలు ఆడుతున్నారని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి విమర్శించారు. గతంలో దత్తత తీసుకున్న గ్రామాల్లో ఇప్పటి వరకు ఏం ఒరగబెట్టారని ప్రశ్నించారు. ఎన్నికలు పూర్తికాగానే టీఆర్ఎస్ నేతలు పత్తా లేకుండా పోతారని రేవంత్ రెడ్డి విమర్శించారు. టీఆర్ఎస్ నేతలు ఎన్ని హామీలిచ్చినా.. నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగదనే విషయాన్ని గుర్తుంచుకోవాలని నియోజకవర్గ ప్రజలకు సూచించారు.

ఆడబిడ్డను గెలిపించండి...

మునుగోడులో 12సార్లు ఎన్నికలు జరిగితే ఇప్పటి వరకు ఒక్క ఆడబిడ్డ గెలవలేదని.. అందుకే ఈసారి పాల్వాయి స్రవంతిని గెలిపించాలని

(మిగతా 2లో..)

## ఇంటర్ పరీక్షలు..

# 100శాతం సిలబస్‌తో ..

## ఆదేశాలు జారీ చేసిన ఇంటర్ బోర్డు



హైదరాబాద్, : తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది 100శాతం సిలబస్‌తో పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. వందశాతం సిలబస్‌కు సంబంధించిన నమూనా ప్రశ్నాపత్రాలు ఇంటర్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. కొవిడ్ కారణంగా గత రెండేళ్ల నుంచి 70శాతం సిలబస్‌తో ఇంటర్ పరీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం కొవిడ్ వ్యాప్తి సమసిపోవడం, ఈ ఏడాది జూన్ 15 నుంచి కాలేజీలు కొనసాగుతున్నందున ఈ ఏడాది 100శాతం సిలబస్‌తో పరీక్షలు నిర్వహించాలని ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి తెలిపారు. తాజా నిర్ణయంతో ఇంటర్మీడియట్ మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులు ఈ ఏడాది 2022-23 వార్షిక పరీక్షలకు 100శాతం సిలబస్‌ను చదవాల్సి ఉంటుంది. ఇంటర్ సిలబస్‌తోపాటు నమూనా ప్రశ్నాపత్రాలను ఇంటర్‌బోర్డు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. అదేసమయంలో మోడల్ ప్రశ్నాపత్రాలను పాఠ్యపుస్తకాల్లోని వెనుక పేజీల్లో ఇప్పటికే ఇచ్చినట్లు నవీన్ మిట్టల్ తెలిపారు.

24 నుంచి ఎంటెక్, ఎంఫార్మసీ, ఎంఆర్క్ తరగతులు

ఎంటెక్, ఎంఫార్మసీ, ఎంఆర్క్ మొదటి విడత సీట్ల కేటాయింపు పూర్తయిందని నవీన్ మిత్తల్ తెలిపారు. 5556 ఎంటెక్ సీట్లలో మొదటి విడతలో 2522 సీట్లు భర్తీ చేసినట్లు చెప్పారు. 3106 ఎంఫార్మసీ సీట్లలో మొదటి విడతలో 2163 సీట్లు భర్తీ చేశామన్నారు. 153 ఎంఆర్క్ సీట్లలో మొదటి విడతలో 46 సీట్లు భర్తీ అయ్యాయని తెలిపారు. ఈ నెల 19 వరకు కాలేజీల్లో రిపోర్టు చేయాలని, ఈ నెల 24 నుంచి ఎంటెక్, ఎంఫార్మసీ, ఎంఆర్క్ తరగతులు నిర్వహిస్తామని తెలిపారు.



## అఖిలేష్, శివపాల్ కలుస్తారా...

లక్నో, అక్టోబరు14, :ములాయంసింగ్ యాదవ్ మరణం తరువాత సమాజ్ వాదీ పార్టీ అధినేత, అతని విడిపోయిన మామ ఇటీవలి రోజుల్లో చాలా సార్లు కలిసి కనిపించారు. సయోధ్య కుదరడం లేదనే ఆలోచనలో పార్టీ కార్యకర్తలు ఉన్నారు. అక్టోబరు 10న ములాయం సింగ్ యాదవ్ మరణానంతరం సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) వర్గాల్లో వినిపిస్తున్న ప్రశ్న ఏమిటంటే, ఎస్పీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్, అతని మామ శివపాల్ సింగ్ యాదవ్ మధ్య సయోధ్య కుదిరిందా లేదా వారి వైరం ఇప్పుడు ముదిరి పాకాన పడు తుందా అనేది చర్చనీయాంసంగా మారింది. ములాయం పరిస్థితి క్షీణించడం ప్రారంభించడంతో, అఖిలేష్, శివపాల్ ఇద్దరూ చాలా సందర్భాలలో కలిసి కనిపించారు. ఈ నెల ప్రారంభంలో ములాయంను ఐసీయూకి తరలించినప్పుడు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన అగ్రనేతలు ఆయన ఆరోగ్యం గురించి విచారించేందుకు ఆసుపత్రికి వచ్చినప్పుడు, అఖిలేష్, శివపాల్, రామ్ గోపాల్ యాదవ్ – ములాయం, శివ పాల్ బంధువు, ఎస్పీ ప్రధాన కార్యదర్శి రిసీవ్ చేసుకోవడానికి అక్కడ ఉన్నారు. వాటిని. ఆసుపత్రిలో ముగ్గురు నేతలు కలిసి ఉన్నట్టు ఎస్పీ ట్విట్టర్‌లో షేర్ చేసిన వివిధ ఫొటోలు. ఎస్పీ వ్యవస్థాపకుడు మరణించిన తరువాత, ఇద్దరూ అతని మృతదేహాన్ని అతని గ్రామమైన సైఫాయికి తరలించారు. మరుసటిరోజు, చివరి వీక్షణ కోసం మృతదేహాన్ని సైఫాయి మేళా మైదానానికి తీసుకువెళుతున్న పుడు, మృతదేహాన్ని తరలిస్తున్నప్పుడు ట్రక్కులో అఖిలేష్, శివపాల్ మరియు ప్రముఖ నాయకుడి కుమారుడు ఆదిత్య ఉన్నా రు. పార్టీ శ్రేణులకు అతీతంగా నాయకులు ములాయంకు నివాళు లర్పించేందుకు వేదిక వద్దకు చేరుకున్నప్పుడు యాదవ్ కుటుంబం మొత్తం వేదికపై నిలబడ్డారు. ఒక్కసారిగా ఎస్పీ అధ్యక్షుడు భావోద్వేగానికి లోనవడంతో శివపాల్ అఖిలేష్ భుజంపై చేయి వేసి ఓదార్చారు. వేదికపై, ఎస్పీ నాయకుడు స్వామి ప్రసాద్ మౌర్య ములాయం మృతదేహంపై ఉంచడానికి రామ్ గోపాల్ యాదవ్‌కు పుష్ప గుచ్ఛాన్ని అందించినప్పుడు, రామ్ గోపాల్ దానిని సమీపంలో నిలబడి ఉన్న శివపాల్‌కు అందించమని మౌర్యను కోరారు. అనంతరం రాంగోపాల్, శివపాల్ కలిసి మృతదేహానికి పుష్పగుచ్ఛం అందించారు. సైఫాయ్‌లోని విలేకరులు బుధవారం శివపాల్‌కు అఖిలేష్‌కు మధ్య ఇది ??కొత్త ప్రారంభాన్ని సూచిస్తుందా అని అడిగినప్పుడు, అనుభవజ్ఞుడైన నాయకుడు, ఇది సమయం కాదు. సమయం వచ్చినప్పుడు చూడవచ్చు అని అన్నారు. తన సోదరుడిని ఎస్పీ సంరక్షక్ గా భర్తీ చేయగలరా అని అడిగిన ప్రశ్నకు, నిర్ణయాలు తీసుకోవడానికి ఇది సమయం కాదు" అని శివపాల్ పునరుద్ఘాటించారు. 2012లో ములాయం ముఖ్యమంత్రిగా చేసిన శివపాల్, అఖిలేష్ ఆశయాలు 2016లో ఎస్పీ నియంత్రణ కోసం తరతరా లుగా సాగుతున్న పోరాటం మధ్య ఒక కొలిక్కి వచ్చాయి. సెప్టెంబరు 13, 2016న, ములాయం రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా శివ పాల్‌ని నియమించిన తర్వాత అఖిలేష్ అన్ని మంత్రిత్వ శాఖల నుండి శివపాల్‌ను తప్పించడంతో కుటుంబ కలహాలు తీవ్రమ య్యా యి. 2017 జనవరిలో అఖిలేష్ ఎస్పీకి నాయకత్వం వహించడంతో, అప్పటి సీఎంకు మద్దతుగా నిలిచిన కుటుంబ సభ్యు ల్లో రామ్ గోపాల్ కూడా ఉన్నారు. 2017 ఎన్నికల తర్వాత శివపాల్ ఎస్పీ నుంచి విడిపోయి ప్రగతిశీల సమాజ్ వాదీ పార్టీ (లోహియా)ని స్థాపించారు. అనుభవజ్ఞుడైన నాయకుడు ఈ సంవత్సరం ప్రారంభంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల కోసం తన మేనల్లుడితో చేతులు కలిపి జస్వంత్‌నగర్ నియోజకవర్గం నుండి ఎస్పీ గుర్తుపై గెలిచారు. అయితే ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీ విజయం సాధించకపోవడంతో అఖిలేష్, అతని మామ మధ్య పాత విభేదాలు మళ్లీ తెరపైకి వచ్చాయి. కూటమి, శాసనసభా పక్ష సమావేశాల నుంచి తనను ఎస్పీ బయటకు పంపిందని శివపాల్ ఆరోపించారు. ఎస్పీ చీఫ్ స్పందిస్తూ.. తన మామ పార్టీకి సభ్యత్వం లేని విషయాన్ని గుర్తు చేస్తూ.. సంస్థ బలోపేతంపై దృష్టి సారించాలని సూచించారు.

## అగ్రరాజ్యంలో మరోసారి పేలిన తుపాకీ.. 5గురు దుర్మరణం

న్యూయార్క్, అక్టోబరు 14, :అమెరికాలో కాల్పుల ఘటనలు అక్కడి ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. అగ్రరాజ్యంలో తాజాగా మరోసారి కాల్పుల కలకలం రేగింది. అమెరికాలోని నార్త్ కరోలినా రాష్ట్రంలోని రాలీ నగరంలో కాల్పుల ఘటనలో ఐదుగురు మరణించారు. రాలీ నగరానికి ఇది విచారకరమైన, విషాదకరమైన రోజు అని నగర మేయర్ మేరీ ఆన్ బాల్డ్విన్ విచారం వ్యక్తం చేశారు. అమెరికాలో ఈ బుద్ధిహీనమైన హింసను ఆపాలంటూ బాల్డ్విన్ వెల్లడించారు. ఇద్దరు వ్యక్తులను ఆసుపత్రికి తరలించారని, వారిలో ఒకరు పోలీసు అధికారి అని యూఎస్ మీడియా నివేదికలు తెలిపాయి. ఇంతకు ముందు కూడా ఈ నివాస ప్రాంతంలో కాల్పులు జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతోందని తెలిపారు. పలు ప్రాంతాల్లో నివాసముంటున్న వారు ఇళ్లలోనే ఉండాలని సూచించారు."ఈ ఘటనపై విచారణ చేపట్టాం. హెడింగ్‌హామ్ పరిసరాల్లోని విభాగాలు మూసివేయబడ్డాయి. నివాసితులు అధికారుల ఆదేశాలను పాటించాలి" అని రాలీ పోలీసులు ట్వీట్ చేశారు. నగర మేయర్‌తో మాట్లాడినట్లు నార్త్ కరోలినా గవర్నర్ రాయ్ కూపర్ తెలిపారు. ప్రజలను సురక్షితంగా ఉంచేందుకు అధికారులు పని చేస్తున్నారని కూపర్ ట్వీట్ చేశారు.

## కేసీఆర్ కూడా నమ్మకం లేదు

చండూరు: మునుగోడు నియోజకవర్గ ఉప ఎన్నికకు తెలంగాణ జనసమితి పార్టీ తరుపున పల్లె వినయ్ కుమార్ నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ వ్యవస్థాపక అద్యక్ష్యుడు కోదండరాం టీఆర్ఎస్, బీజేపీని తీవ్రంగా విమర్శించారు. కేసీఆర్ ఏనాడూ తెలంగాణ ప్రయోజనాలను పట్టించుకోలేదని, రాజగోపాల్ రెడ్డి తన ప్రయోజనాల కోసం ఈ ఉప ఎన్నిక తీసుకొచ్చారని ఆరోపించారు. 'పైసలను చూడకుండా ప్రజా సంక్షేమం కోసం పాటుపడేవారికి మద్దతు ఇవ్వాలి. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం జనసమితి పోటీలో ఉంది. తెలంగాణతో టీఆర్ఎస్ సంబంధాలు తెంపేసుకుంది. తెలంగాణ ఆకాంక్షల కోసం ప్రయత్నం జరగాలి. కేసీఆర్ జాతీయ స్థాయిలో గెలుస్తారని ఆయనకి కూడా నమ్మకం లేదు. సొంత ప్రయోజనాలు తప్పా కేసీఆర్ ఏనాడూ తెలంగాణ ప్రయోజనాలను పట్టించుకోలేదు. చేనేతపై జీఎస్టీ రద్దు కోసం టీఆర్ఎస్ ప్రయత్నం చేయలేదు. కాంట్రాక్టుల కోసమే ఈ ఎన్నికలు వచ్చాయి. చేనేత రంగంపై జీఎస్టీ రద్దు చేయాలని రాజ్ గోపాల్ పోరాడితే ప్రజలు నమ్మేవారు. కాని తన ప్రయోజనాల కోసం ఈ ఎన్నిక తీసుకొచ్చారు" అని పేర్కొన్నారు.

# సింగరేణిలో దళిత ఉద్యోగుల సమస్యలపై రివ్యూ మీటింగ్

### హాజరైన జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ చైర్మన్ విజయ సంప్లా



హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి ): దళిత ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై సింగరేణి లో రివ్యూ మీటింగ్ ను ఏర్పాటు చేశారు. న్యూఢిల్లీ లోని కమిషన్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ చైర్మన్ విజయ సంప్లాతో పాటు సింగరేణి గిరిజన ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు గోళ్ళ రవేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గోళ్ళ రవేష్ మాట్లాడుతూ అక్టోబర్ 11 వ తేదీన న్యూఢిల్లీలోని నేషనల్ కమిషన్ ఫర్ ఎస్ సి చైర్మన్ విజయసంప్లా అధ్యక్షతన కమిషన్ కోర్టు హాలులో సింగరేణి యాజమాన్యంతో సింగరేణి లోని దళిత ఉద్యోగుల సమస్యల మీద ఏర్పాటుచేసిన సమావేశంలో తాను పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో తనతోపాటుగా సింగరేణి డైరెక్టర్ ఎస్ చంద్రశేఖర్ సింగరేణి డైరెక్టర్ ఫైనాన్స్ శ్రీ ఎన్ బలరాం నాయక్ సింగరేణి జిఎం పర్సనల్ శ్రీ బసవయ్య చీఫ్ లైసెన్ ఆఫీసర్ ఫర్ ఎస్సీ శ్రీ కలవల నారాయణ తదితరులు పాల్గొన్నారన్నారు. ఈ సమావేశంలో మొదటి సమస్యగా జీవో నంబర్ 154, %ణ%:30.07.2008 ప్రకారం ప్యానల్ ఇయర్ లో రాబోయే వేకెన్సీలను కూడా దృష్టిలో పెట్టుకొని ఎస్సీ ఎస్టీలకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ను అమలు చేయాల్సి ఉన్నప్పటికీ 2008వ సంవత్సరం నుంచి 2018 సంవత్సరం వరకు ఈ జీవోను అమలు చేయకపోవడం అనే విషయాన్ని చైర్మన్ దృష్టికి తాను తీసుకువచ్చినట్లు ఆయన తెలియజేశారు. దీనికి స్పందించిన చైర్మన్ 2008 నుంచి 2018 వరకు ఏ ఏ దళిత ఉద్యోగులకు ఈ జీవో ప్రకారం ప్రమోషన్లు రావాలో వాటన్నిటినీ ఇచ్చి నవంబర్ 28వ తేదీన యాక్షన్ టేకెన్ రిపోర్ట్ తో మళ్లీ కమిషన్ లో హాజరవ్వాల్సిందిగా ఆదేశించార న్నారు.

రిప్రజెంట్ చేసిన మిగతా విషయాలు క్రింది విధంగా ఉన్నాయి.

1. ప్రతి ఏరియాలో కనీసం రెండు సివిల్ కాంట్రాక్టులను గిరిజనులు లేదా దళితులకు సంబంధించిన ప్రభావిత ప్రాంత ప్రజలకు కో-ఆపరేటివ్ సొసైటీలు ఏర్పాటు చేయడం ద్వారా ఇవ్వాలని ఉంది. కానీకేవలం నాలుగు ఏరియాలలో మాత్రమే ఈ సర్క్యులర్ అమలవుతోంది. సింగరేణిలోని మిగతా ఏడు ఏరియాలలో కూడా ఏరియాకు రెండు కాంట్రాక్టులు చొప్పున ఎస్సీ ఎస్టీలకు ఇవ్వాలని అభ్యర్థించడం జరిగింది.
2. సింగరేణిలో ఉన్న 11 ఏరియాలలో ఏరియా జనరల్ మేనేజర్ గా ఒక ఎస్సీ కాండేట్ మాత్రమే ఉన్నారు. ఇంకొకరిని నియమించాల్సి ఉంది.
3. తెలంగాణ ప్రభుత్వం ఔట్సోర్సింగ్ ఉద్యోగాలలో కూడా ఎస్సీ ఎస్టీలకు రిజర్వేషన్ కల్పిస్తున్న నేపథ్యంలో సింగరేణిలో కూడా అద్దె కార్ల కేటాయింపులలో ఎస్సీ ఎస్టీలకు రిజర్వేషన్ కల్పించాలి అని రిప్రజెంట్ చేయడం జరిగింది.
4. గతంలో డిపార్ట్మెంటల్ ప్రమోషన్ కమిటీ సూచనల మేరకు ఇచ్చిన ప్రమోషన్లలో ఎస్సీ ఎస్టీలకు అన్యాయం జరిగిన విషయాన్ని దృష్టిలో పెట్టుకొని కమిటీలో లైసెన్ ఆఫీసర్ కు చోటు కల్పించాలని రిప్రజెంటేషన్ ఇవ్వడం జరిగింది.
5. సింగరేణిలో కూడా క్వార్టర్లీ, హాఫ్ ఇయర్లీ రివ్యూ మీటింగ్ లు ఏర్పాటు చేసి ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని రిప్రజెంటేషన్ చేయడం జరిగింది.
6. అదేవిధంగా రాష్ట్రపతి ఉత్తర్వులను అనుసరించి సింగరేణిలో ఇద్దరు లైసెన్ అసిస్టెంట్లు ఒక పర్సనల్ అధికారితో కూడిన లైసెన్స్ సెల్ ఏర్పాటు చేయాలి. ఫ్రెండ్స్ ఈ అన్ని సమస్యల మీద నవంబర్ 28వ తారీకు తేదీన కోలంకషంగా చర్చించడం జరుగుతుంది ఆరోజు ఢిల్లీకి రావాలి అని నేషనల్ కమిషన్ చైర్మన్ విజయ సంప్లా తెలిపారు.

## తెలంగాణ రాష్ట్రం కేసీఆర్ గడీలలో బంధీ అయ్యింది: ఎర్రం మహేష్



చౌటుప్పల్, అక్టోబర్ 14 (ప్రజాపాలన ప్రతినిధి):వెయ్యి మంది బలిదానాల ద్వారా సాధించుకున్న తెలంగాణ కెసిఆర్ గడీలలో బందీ అయిందని బిజెపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎర్రం మహేష్ అన్నారు. చౌటుప్పల్ మండలం లింగోటం గ్రామంలో ఇంటింటి ప్రచారంలో పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ వస్తే కాపలా కుక్కలాగా ఉంటానన్న ముఖ్యమంత్రి తెలంగాణను దోచుకు తింటున్నారని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన నీళ్లు, నిధులు, నియామకాల హామీ ఎక్కడ పోయిందని, మిగులు బడ్జెట్ లో ఉన్న తెలంగాణను అప్పుల తెలంగాణగా మార్చింది ఎవరో ప్రజలకు చెప్పాలన్నారు. కమిషన్ల కోసం కాలేశ్వరం కట్టి వేల కోట్లను కూడబెట్టుకున్నారని కానీ మునుగోడు నియోజకవర్గం లోని 140 గ్రామాల్లో ఒక్క ఎకరం కూడా నీళ్లు ఇవ్వలేదని తెలిపారు. డిండి, శివన్నగూడెం భూనిర్వాసితులకు నష్టపరిహారం కూడా ఇవ్వలేదన్నారు. టిఆర్ఎస్ పార్టీని గెలిపిస్తే మునుగోడును దత్తత తీసుకుంటానన్న కేటీఆర్, ఓట్లు వేస్తేనే అభివృద్ధి చేస్తావా అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలనుకుంటే ప్రజల జీతగాళ్ళైన 80 మంది ఎమ్మెల్యేలను, 14 మంది మంత్రులను నియోజకవర్గానికి రప్పించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. బిజెపి అభ్యర్థి రాజగోపాల్ రెడ్డిని అధిక మెజారిటీతో గెలిపించి కుటుంబ పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఉప్పు భద్రయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొట్టు అబ్బయ్య, మండల ప్రధాన కార్యదర్శి రధారపు సత్తయ్య, ఉపసర్పంచ్ గంగాపురం గంగాధర్,భూత అధ్యక్షులు వనం సత్యనారాయణ, వనం రాజు, ఆకుల మధు, బి. మైసయ్య, కట్ట కృష్ణ, శక్తి కేంద్ర ఇన్చార్జి లగోని పాండు, బాతరాజు కృష్ణ, చేకూరి రమేష్, యాట వెంకటేష్, పల్స నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## గులాబీకి డబుల్ ఇంజన్ సాధ్యమేనా..?

హైదరాబాద్, అక్టోబరు 14,:అనుకున్నట్లే జరిగింది. రెండు దశాబ్దాల క్రితం తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా, ఉద్యమ పార్టీగా పురుడు పోసుకున్న తెలంగాణ రాష్ట్ర సమితి భారత రాష్ట్ర సమితిగా పేరు మార్చుకుంది. జాతీయ పార్టీగా ఎదిగే దిశగా తొలి అడుగు వేసింది. తెరాస /భారాస అధ్యక్షుడు కల్వకుట్ల చంద్రశేఖర రావు 68 ఏళ్ల వయసులో తమ రాజకీయ జీవితంలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. అయితే, పేరు మారినా, ప్రాంతీయ పార్టీ జాతీయ పార్టీగా కొత్తగా ప్రస్థానం మొదలు పెట్టినా, పార్టీ కార్యక్షేత్రం మారలేదని, కొత్త పాత పార్టీల వ్యవస్థాపక అధ్యక్షుడు హోదాలో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్, స్పష్టం చేశారు. భారత రాజకీయ రంగాన్ని ప్రభావితం చేసేందుకే జాతీయ పార్టీతో ముందడుగు వేస్తున్నామని చెప్పారు. అంతే,కాదు, ఎవరికీ ఎలాంటి అనుమానాలు లేకుండా, రాకుండా తెలంగాణ ముఖ్యమంత్రిగా తానే ఉంటానని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రిగా ఉంటూనే, దేశమంతా పర్యటిస్తానని కేసీఆర్ స్పష్టం చేశారు. అలాగే, కార్యక్షేత్రం వదిలేది లేదని, ఈ విషయంలోనూ ఎవరికీ ఎలాంటి అనుమానం అవసరం లేదని చెప్పారు. నిజంగానే కేసీఆర్ ఎప్పటిలా జోడు పదవుల్లో కొనసాగుతారా ? సమయం సందర్భం చూసుకుని, ముఖ్యమంత్రి పదవిని మరొకరికి అప్పగిస్తారా,అనేది చూడవలసి వుంది. నిజానికి తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భావం నుంచి స్వయంగా కేసీఆర్ చేసిన, నిన్నటి ముగింపు ప్రకటన వరకు ఆయనే తెరాస పార్టీ అధ్యక్షునిగా ఉన్నారు. అలాగే, 2014 నుంచి ఈ రోజు వరకు పార్టీ అధ్యక్ష పదవితో పాటుగా రాష్ట్ర ముఖ్యమంత్రిగానూ జోడు పదవులలో కొనసాగుతున్నారు. అఫ్కోర్స్, కుమారుడు కేటీఆర్ కార్యనిర్వాహక అధ్యక్షునిగా, చేదోడు వాదోడుగా ఉన్నారనుకోండి, అది వేరే విషయం. రాష్ట్ర స్థాయిలో సాధ్యమైన జోడు పదవుల స్వారీ జాతీయ స్థాయిలో సాధ్యమవుతుందా? ఈ ఏర్పాటు ఎంత కాలం కొనసాగుతుంది? అనేది, ఇప్పుడే తెలిసే విషయం కాదు. నిజమే, కాంగ్రెస్ జాతీయ అధ్యక్ష పదివితో పాటు, రాజస్థాన్ ముఖ్యమంత్రిగా జోడు పదవులు తనకే కావాలని కోరుకున్న ఆ రాష్ట ముఖ్యమంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు,అశోక గెహ్లాట్ ఎదురైన అవరోధాలు, అడ్డంకులు, కేసేఆర్' కు లేవు. కాంగ్రెస్ పెట్టుకున్న ఒక వ్యక్తికి ఒకే పదవి నియమం తెరాసకు పెట్టుకోలేదు. అంతేకాదు, అది తెరాస అయినా భారాస అయినా,గులాబీ పార్టీ కర్త, కర్మ, క్రియ అన్నీ కేసీఆరే కాబట్టి, రాజస్థాన్' పరిణామాలను ఇప్పటి కిప్పుడు తెలంగాణలో ఉహించలేము. కేంద్ర ఎన్నికల సంఘం తెరాస పేరు మార్పును అధికారికంగా గుర్తించి, తెరాస అధ్యక్షుడు కేసేఆర్, భారాస అధ్యక్షునిగా ఎన్నికైన తర్వాత, సంస్థాగత మార్పులు చేపట్టక తప్పక పోవచ్చును. అలాగే, అలాంటి ఆలోచన గులాబీ బాసుకు లేక పోలేదని అంటున్నారు. అయితే, తెరాస పేరు మార్పు,అనుకున్నట్లుగా ఒకటి రెండు రోజుల్లో తేలిపోతుందా, లేదా అనేది, కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని, సో అంత వరకు సంస్థాగత మార్పులు ఉండవనే అంటున్నారు.అదలా ఉంటే, ముఖ్యమంత్రి కేసీఆర్,ఓ వంక జాతీయ వాదాన్ని ఎత్తు కుంటూనే, తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వ వాదాన్ని వదిలేది అంటున్నారు. ముఖ్యమంత్రి కేసేఆర్ తమకున్న అనుభవంతో జోడు పదవులను సమర్ధవంతంగా నిర్వర్తించ వచ్చునేమో కానీ, జోడు విధానాలను, జోడు వాదాలను ఎలా, సమన్మయ పరచు కుంటారు అనేది, ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా వుందని అంటున్నారు. రెండు దశాబ్దాల తెరాస చరిత్ర, కేసీఆర్ రాజకీయ జేవిత చరిత్ర మొత్తం తెలంగాణ కేంద్రంగానే సాగిందనేది కాదన లేని నిజం. కేసేఅర్' కు జాతీయ స్థాయిలో ఏదైనా గుర్తింపు ఉందంటే, అది తెలంగాణ ఉద్యమ నేతగా, తెలంగాణ అస్తిత్వ వాదంతో ముడిపడి ఉన్నగుర్తింపే కానీ, మరొకటి కాదు. అయితే, ఆ ప్రస్తావన ఎక్కడా రాకుండా, ఎనిమిదేళ్ళలో తెలంగాణ రాష్ట్రం సాధించిన విజయాలనే జాతీయ ఎజెండాలో చేర్చారు. అందులోనూ ప్రధానంగా సంక్షేమ పథకాలను, మరీ ముఖ్యంగా కౌలు రైతలకు కాదని, వందల ఎకరాల భూములు, వందల కోట్ల ఆస్తులు ఉన్న మంత్రి మల్లా రెడ్డి వంటి భూస్వాములు, రాజకీయ, వ్యాపార రంగాలలో స్థిరపడిన ధనికులు, ప్రభుత్వ ఉద్యోగులకు సహా భూస్వాములకు ప్రజల సొమ్మును దోచి పెడుతున్నారనే ఆరోపణలున్న రైతు బంధు, ఇంకా ్రాష్ట్రంలోనే పూర్తి స్థాయిలో పట్టాలేక్కని దళిత బంధు, గిరిజనబందు వంటి పథకాలనే తెలంగాణ మోడల్' గా ప్రముఖంగా పేర్కొంటున్నారు. ఈ ఎజెండాకు దేశ ప్రజలు ఎంతవరకు ఆమోదిస్తారు అనేది ఎలా ఉన్నా, జంట పదవులు, జోడు వాదాలలో భారాస ప్రస్థానం ఎలా ముందుకు సాగుతుంది అనేది, చూడవలసి ఉందని అంటున్నారు.

## మునుగోడును దత్తత తీసుకుంటానని కేటీఆర్ డ్రామాలు : రేవంత్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

రేవంత్ పిలుపునిచ్చారు. సీతక్క సమ్మక్క అయితే.. స్రవంతి సారలక్కగా మారుతుందని అన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధికి పాల్వాయి గోవర్ధన్ రెడ్డి చివరి శ్వాస వరకు ప్రయత్నించారని రేవంత్ అన్నారు. మునుగోడులో గెలుపు కోసం ప్రత్యర్థి పార్టీల నాయకులు సీసాలు, డబ్బుల సంచులు తీసుకొచ్చారని విమర్శించారు. 8 ఏళ్లుగా టీఆర్ఎస్ అధికారంలో ఉన్నా మునుగోడును అభివృద్ధి చేయలేదని విమర్శించారు. 2014లో ఎమ్మెల్యేగా గెలిచిన కూసుకుంట్ల నియోజకవర్గ అభివృద్ధికి ఏం చేశారో చెప్పాలని నిలదీశారు. పాల్వాయి స్రవంతిని ఓడించేందుకు టీఆర్ఎస్, బీజేపీ నేతలు ప్రయత్నిస్తున్నారని.. నియోజకవర్గ ప్రజలు ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు.

## హైదరాబాద్ లోని పలు షాపింగ్స్ మాల్స్ పై ఐటీ దాడులు

(మొదటి పేజీ తరువాయి)

మధ్య లావాదేవీలపై కూపీ లాగుతున్నారు.హానర్ రియల్ ఎస్టేట్, ఫినిక్స్ సంస్థల మధ్య.. గల్ఫ్ ఆయిల్ కంపెనీకి చెందిన ఓ స్థలం క్రయవిక్రయం జరిగినట్లు తెలుస్తోంది. కూకట్ పల్లిలోని గల్ఫ్ ఆయిల్ ల్యాండ్ వివాదాల్లో హానర్ సంస్థ జోక్యం చేసుకున్నట్లు ఐటీశాఖ అధికారులు గుర్తించారు. హానర్ సంస్థ పెద్దఎత్తున పెట్టుబడులు, వ్యాపార సమూహాలను ఏర్పాటు చేసుకున్నట్లు ఐటీ అధికారులు గుర్తించినట్లు సమాచారం. హానర్ అనుబంధ సంస్థలైన ఆర్ఎస్ బ్రదర్స్, లాట్ మొబైల్స్, బిగ్ సీల మధ్య చెల్లింపు వివరాలను ఐటీ అధికారులు సేకరించినట్లు సమాచారం. మరోవైపు కొంతమంది రాజకీయ ప్రముఖులు, తెలుగు రాష్ట్రాల్లో పేరుగాంచిన ఓ నిర్మాణ సంస్థకు, హానర్ రియల్ ఎస్టేట్ సంస్థ అనుబంధంగా ఉన్నట్లు చెబుతున్నారు.

## అంతుచిక్కని వ్యూహం

(మొదటి పేజీ తరువాయి)

ఓవైపు మునుగోడు ఉపఎన్నికల వేడి తారాస్థాయికి చేరుకున్న సమయంలో కేసీఆర్ ఢిల్లీలో కాలక్షేపం చేయడం వెనుక ఆంతర్యం ఎవరికీ అంతుబట్టడం లేదు. తాను తీసుకునే నిర్ణయాలకు, వేసే అడుగులకు చాలా కాలం ముందు నుంచే ప్రణాళికలు, వ్యూహాలు సిద్ధం చేసుకునే అలవాటున్న కేసీఆర్, ఇప్పుడు ఢిల్లీలో మకాం వేయడం కూడా వ్యూహాత్మక ఎత్తుగడగా రాజకీయవర్గాలు భావిస్తున్నాయి.




మీరు ఇల్లు / స్థలం కొనాలనుకుంటున్నారా...
లేదా అమ్మాలనుకుంటున్నారా?
అయితే ....
ఈ ప్రకటన మీకోసమే
సంప్రదించండి
8886911944

## శంకరపట్నం లో చేప పిల్లల పంపిణి



శంకరపట్నం అక్టోబరు 14 ప్రజాపాలన: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల ఆర్థికభివృద్ధికి ఎన్నో సంక్షేమ పథకాలను అందించిందని శంకరపట్నం %ఓజ్ష్% లింగంపల్లి శ్రీనివాస్ రెడ్డి గురువారం స్థానిక మండల కేంద్రం లోని పెద్దమ్మ గుడి వద్ద జరిగిన కార్యక్రమములో అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మత్స్య కరుల సంక్షేమ కోసం ప్రతి సంవత్సరం ఉచ్చిత చేపపిల్లల పంపినీ కార్యక్రమం చేపడుతుందని ఈ సారి కూడ 9 లక్షల చేపపిల్లలను పంపిచేసిందని %ఓజ్ష్% అన్నారు . ఈ కార్యక్రమం లో టీఆర్ ఎస్ మండల అద్యక్షుడు గంటా మహిపాల్ ఎఫ్ డి ఓ విజయ్ కిరణ్కర్ మరియూ స్థానిక మత్స్యకారులు పాలుగొన్నారు.

## రెవరెండ్ బిషప్ ఉడు ముల బాల రావినూతల రాక



బోనకల్, అక్టోబర్ 14 ప్రజాపాలన ప్రతినిధి: ఖమ్మం మెత్రాసన పీఠాధిపతులు రెవరెండ్ బిషప్ ఉడుముల బాల జపమాల మాత పండుగను పురస్కరించుకొని రావినూతల విచారణకు వచ్చారు. క్రైస్తవ భక్తులు ఫాదర్ జి అమృతయ్య ఆధ్వర్యంలో కోలాటాలు డబ్బు దరవులు పూలమాలతో ఘనంగా స్వాగతం పలికారు విశాల పరిధిలో గ్రామాల ప్రజలు సంతోషంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వారి వెంట శాంతి నిలయం నిర్వాహకులు, మహిళలు, క్రైస్తవ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బాలికలు మహిళల రక్షణ కోసమే షీ టీమ్స్



ఆసిఫాబాద్ జిల్లా అక్టోబర్ 14 (ప్రజాపాలన, ప్రతినిధి) : బాలికలు మహిళల రక్షణ కోసమే షీ టీంలు పని చేస్తున్నాయని ఆసిఫాబాద్ షీ టీం ఇంఛార్జ్ సునీత అన్నారు. శుక్రవారం జిల్లా ఎస్పీ సురేష్ కుమార్, అదనపు ఎస్పి (అడ్మిన్) అచ్చేశ్వర్ రావు, ఆదేశాల మేరకు మండలంలోని బూరుగుడా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ విద్యార్థులు, మహిళలపై హింస, సైబర్ క్రైమ్ లకు ఎవరైనా గురి అయినట్లయితే వెంటనే షీ టీం ను సంప్రదించాలని సూచించారు. అలాగే ఏదైనా అత్యవసర సమయంలో డయల్ 100 కు కాల్ చేయాలని పేర్కొన్నారు. షిటిం ఆసిఫాబాద్ 9346987214 కు సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఉదయ్ బాబు, గ్రామ సర్పంచ్ మాధవి, సెక్రెటరీ శ్రీలత, షీ టీమ్ సభ్యులు శ్రీలత, స్వప్న, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో సిపిఐ కార్యకర్త మృతి



బోనకల్, అక్టోబర్ 14 ప్రజాపాలన ప్రతినిధి : మండల పరిధి లోని రాయన్నపేట గ్రామానికి చెందిన సిపిఐ కార్యకర్త వరనగాని కృష్ణ(65) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు . ఆయన మృతదేహానికి సిపిఐ జిల్లా సమితి సభ్యులు తూము రోషన్ కుమార్ పార్టీ జెండాను కప్పి, పూలమాలవేసి నివాళులు అర్పించారు. మృతునికి ఇద్దరు కుమారులు ఉన్నారు. నివాళులర్పించిన వారిలో బొమ్మినేని హన్మంతరావు, బొమ్మినేని కొండలరావు, ఏలూరు పూర్ణచందు, తోటపల్లి ఆనందరావు, వల్లేబోయిన వీరభద్రం, మరీదు ఈశ్వరమ్మ, సొసైటీ డైరెక్టర్ మరీదు వెంకటేశ్వర్లు, సీపీఎం నాయకులు శ్రీహరి తదితరులు ఉన్నారు.

## మన ఊరు మనబడి మౌలిక అభివృద్ధి పనులకుభూమి పూజ



ఇబ్రహీంపట్నం అక్టోబర్ 14 (ప్రజాపాలన ప్రతినిధి): మండలంలోని కోమటి కొండాపూర్ గ్రామంలో ఉన్నత పాఠశాల లో ఇరవై మూడు లక్షలు అంచనా వ్యయం తో పాఠశాల అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈకార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మండల జడ్పీటీసీ. కముటం భారతి రమేష్,ఎంపీపీ జజాల భూమేశ్వరి, ఎంపీడీఓ ప్రభు. ఇంజనీర్ వేణు. సర్పంచ్ కొప్పోలు శ్రీనివాస్, ఎంపీటీసీ అక్కనపెల్లి జెలేష్,ఉప సర్పంచ్ నల్ల శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి సరిత, విద్యాకమిటి చైర్మన్ రెబ్బసి సాగర్, పాఠశాల ప్రాథనాపాధ్యాలు. గంగాధర్, మరియు ఉపాధ్యాయులు వార్డు మెంబెర్స్. కారోబారో గుండెల మహదేవ్, ఫీల్డ్ అసిస్టెంట్ బన్న పోచయ్య, తదితరులు పాల్గొన్నారు.

## హబ్సిగూడలో జోయాలుక్కాస్ బంగారు నగల షో రూంను ప్రారంభించిన ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి



మేడిపల్లి, అక్టోబర్ 14 (ప్రజాపాలన ప్రతినిధి): హబ్సిగూడ చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన జోయాలుక్కాస్ బంగారు నగల షో రూం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మీ, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి పాల్గొని షో రూంను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు జోయాలుక్కాస్ మేనేజింగ్ డైరెక్టర్, వారి కుటుంబ సభ్యులు ,సిబ్బంది , రామంతపూర్ మాజీ కార్పొరేటర్ గంధం జ్యోత్స్నానాగేశ్వరరావు, టీఆర్ఎస్ సీనియర్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి, గడ్డం రవికుమార్, కాటేపల్లి రవీందర్ రెడ్డి, కృష్ణ రెడ్డి, లక్ష్మీనారాయణ, మనోహర్, దాచేపల్లి శ్రీధర్, పూర్ణచందర్, చంద్రశేఖర్, నాని, స్థానిక కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## రామంతాపూర్ డివిజన్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే కార్పోరేటర్



మేడిపల్లి, అక్టోబర్ 14 (ప్రజాపాలన ప్రతినిధి): రామంతాపూర్ డివిజన్లోని రాజేంద్రనగర్ కాలనీలో రూ 40 లక్షలతో సీసీ రోడ్డు పనులను ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డితో కలిసి స్థానిక డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్ రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ జిహెచ్ఎంసి అధికారులు, నాయకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## సీతానగరంలో పర్యటించిన జడ్పీ చైర్మన్ లింగాల



బోనకల్, అక్టోబర్ 14 ప్రజాపాలన ప్రతినిధి: మండల పరిధిలోని సీతానగరం గ్రామంలో శుక్రవారం జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు పర్యటించారు. ముందుగా టిఆర్ఎస్ నాయకులు కటారు నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు వారి తండ్రి లక్ష్మయ్య జ్ఞాపకార్థంగా ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో నూతనంగా ఎర్పటు చేసిన వాటర్ బోరును ప్రారంభించినారు. అనంతరం అదే గ్రామంలో అనారోగ్యంతో ఉన్న గుడారు తిరుపతిరావు,లక్ష్మీ నరసమ్మ లను పరామర్శించినారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల అధ్యక్షులు చేబ్రోలు మల్లికార్జునరావు, మండల కార్యదర్శి మోదుగుల నాగేశ్వరరావు, మండల రైతు కన్వీనర్ వేమూరి ప్రసాద్, మాజీ మండల అధ్యక్షులు బంధం శ్రీనివాసరావు, మాజీ జెడ్పిటిసి బానోత్ కొండ, అనగాని మురళి, వివిధ హోదాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాజకీయాలకు అతీతంగా కార్తీక పౌర్ణమి ఉత్సవాలు

**ఉత్సవానికి రూ.5 వేల ఆర్థిక సహాయం అందించిన ముస్లిం యువతి**



పాలేరు అక్టోబర్ 14 ప్రజాపాలన ప్రతినిధి: నేలకొండపల్లికార్తీక పౌర్ణమి ఉత్సవాలను రాజకీయాలకు అతీతంగా నిర్వహించేందుకుచర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ దండా పుల్లయ్య తెలిపారు. మండలంలోని రాజేశ్వరపురం పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్తీకపౌర్ణమి ఉత్సవాల పై జరిగిన సమీక్ష సమావేశం లో ఆయన మాట్లాడారు, నవంబర్ 5,6,7 తేదీల్లో జిల్లాలోనే అంగరంగ వైభవంగా నిర్వహించే కార్తీక పౌర్ణమి జాతర ను ఎలాంటి రాజకీయ విబేధాలు లేకుండా ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని. సూచించారు. అందుకు గ్రామంలోని అన్ని రాజకీయ పక్షాలుసహకరించాలని కోరారు. గ్రామ ప్రజలు సుభిక్షంగా ఉండేందుకు ఉత్సవాలను కనివినీ ఎరగని రీతిలో చేయాలని తెపోత్సవం. దీపోత్సవం తదితర కార్యాక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జిల్లాలోనే ఆదర్శంగా నిలిపేందుకు ప్రతీ ఒక్క తదితర కార్యాక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జిల్లాలోనే ఆదర్శంగా నిలిపేందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. అదే విధంగా కార్తీక పౌర్ణమి సందర్భంగా శివాలయం కు రంగులు వేయించేందుకు గ్రామానికి చెందిన ముస్లిం యువతి యాకోబీ రూ.5 వేల ఆర్థిక సహయంను ప్రకటించింది. ఈ సందర్భంగా ఆమె ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు యలమద్ది లెనిన్, శారధ, దండా నరసింహారావు. సొందు, ఎన్. మల్లయ్య, హనుమంతు, ఇస్లావత్ బాలాజీ, గడ్డమీది వెంకన్న, దండా సతీష్ . సుభాష్ తదితరులు.

## కుసుకుంట్ల గెలుపు కోసం ఇంటింటి ప్రచారం నిర్వహించిన మంత్రి మల్లారెడ్డి



చౌటుప్పల్, అక్టోబర్ 14 (ప్రజాపాలన ప్రతినిధి) :కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే మునుగొడులో టీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తాయాని కుసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి భారీ మెజారిటీతో గెలబోతున్నారని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి తెలిపారు. చౌటుప్పల్ మండలం అరేగుడెం,కాట్రేవు గ్రామాలలో చౌటుప్పల్ మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు అరేగుడెం సర్పంచ్ మునగాల ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి మల్లారెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని రైతులు,వృద్ధులతో కలిసి మాట్లాడుతూ కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించి గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. గ్రామంలో కులసంఘ భవనాలు కావాలని గ్రామస్థులు కోరగా ఎన్నికల తర్వాత ఖచ్చితంగా నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాట్రేవు సర్పంచ్ బచ్చ రామకృష్ణ,గ్రామశాఖ అధ్యక్షుడు బచ్చ మల్లయ్య,పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకటరెడ్డి, ఆరెగూడెం గ్రామ ఉప సర్పంచ్ జాల మమత మల్లేష్, గ్రామ శాఖ అధ్యక్షులు ఎనపల్లి ముత్తిరెడ్డి, నాయకులు హనుమయ్య, అనిల్ రెడ్డి, నాగిరెడ్డి, భూపాల్ రెడ్డి, రవీందర్ రెడ్డి, మునగాల రాఘవరెడ్డి, దుర్గం రాజు, జాల శ్రీశైలం, ఎనపల్లి రంగారెడ్డి, అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## రాష్ట్ర అభివృద్ధి బిజెపి తోనే సాధ్యం: కళ్లెం నవజీవన్ రెడ్డి



చౌటుప్పల్, అక్టోబర్ 14 (ప్రజాపాలన ప్రతినిధి): 8 సంవత్సరాల కేసీఆర్ పాలనలో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని రాష్ట్ర అభివృద్ధి కేవలం బిజెపితోనే సాధ్యపడుతుందని హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి అన్నారు. శుక్రవారం చౌటుప్పల్ పురపాలక పరిధిలోని లక్కారం గ్రామ భాజపా ఇన్చార్జ్ గా ప్రచారం నిర్వహిస్తున్న తరుణంలో సూర్య దినపత్రిక పలకరిస్తే వారు మాట్లాడుతూ కెసిఆర్ రాష్ట్ర ప్రజలను ఏనాడో మరిచిపోయారని కేవలం కుటుంబానికే పరిమితమై కుటుంబ అభివృద్ధి నే చూస్తున్నారని మండిపడ్డారు. మునుగోడులో డబ్బు రాజకీయాలు చేస్తున్న టిఆర్ఎస్ పార్టీకి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. కెసిఆర్ ఎన్ని డబ్బులు ఖర్చు పెట్టినా ఎంతమంది మంత్రులను మునుగోడులో దింపిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విజయం ఆపలేరున్నారు. మునుగోడు లో భాజపా విజయానికి బూతు స్థాయిలో ప్రతి భాజపా కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

# బీజేపీలోకి బూర!

(మొదటి పేజీ తరువాయి)

బండి సంజయ్‌తో బూర చర్చలు జరిపినట్టు తెలిసింది. అనంతరం ఢిల్లీ చేరుకున్న ఆయన తరుణ్ చుగ్‌తో సమావేశమయ్యారని, పార్టీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హెూంమంత్రి అమిత్ షాను కలిసే ప్రయత్నాల్లో ఉన్నట్టు తెలిసింది. అయితే ఈ విషయంపై ఆయన్ను సంప్రదించేందుకు ప్రయత్నించగా.. ఫోన్లో అందుబాటులో లేరు.

నన్ను కలవలేదు ఇప్పట్లో చేరికలేమీ లేవు: తరుణ్ చుగ్

బూర నర్సయ్య గౌడ్ ఢిల్లీ చేరుకున్నారన్న సమాచారం తెలుసుకున్న మీడియా ప్రతినిధులు జేపీ నడ్డా నివాసం వద్ద ఎదురుచూస్తుండగా.. నడ్డాతో సమావేశమై బయటికొచ్చిన తరుణ్ చుగ్ కనిపించారు. బూర నర్సయ్య గౌడ్ చేరికపై ఆయన్ను ప్రశ్నించగా.. తనను ఎవరూ కలవలేదని చెప్పారు. హిమాచల్ ప్రదేశ్ ఎన్నికలపై జాతీయాధ్యక్షుడు నడ్డాతో చర్చించేందుకు మాత్రమే వచ్చానని వివరించారు. అయితే పార్టీలో ఎవరైనా, ఎప్పుడైనా చేరవచ్చని అన్నారు. బూర నర్సయ్య గౌడ్ చేరికకు సంబంధించి తన వద్ద ఎలాంటి సమాచారం లేదని, ఇప్పట్లో ఎలాంటి చేరికలు లేవని ఆయన వ్యాఖ్యానించారు. రాజకీయ క్షేత్రంలో రేపు ఏదైనా జరగవచ్చని అన్నారు.


మాస్టర్ కీ TV

అసెంబ్లీ నియోజకవర్గాల

తెలంగాణ కంటెంట్ ఓనర్స్

భారతదేశంలో ఫోర్త్ ఎస్టేట్ గా పిలవబడే మీడియా ,కొన్ని వర్గాలు, కొన్ని పార్టీల చేతిలో కీలుబొమ్మగా ఉన్న విషయం విధితమే. దీని వలన , మూడవ ఎస్టేట్స్ అయినటువంటి పార్లమెంట్, ఎగ్జిక్యూటివ్, జ్యూడిషరీ వ్యవస్థలోని తప్పిదాలు ప్రపంచానికి తెలియపరచలేకపోతుంది. మరీ ముఖ్యంగా ఈ దేశం బాగుండాలని కోరుకునే అభ్యుదయవాదులు బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, క్రిస్టియన్, ముస్లిం, మైనార్టీలు వారి సమస్యలు ప్రభుత్వాలకు తెలియకపోవడం వలన దేశాభివృద్ధిలో బహుజనులు పాలు పంచుకోలేక పోతున్నారు.

అదేవిధంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారు చెప్పిన విధంగా
"పక్షికి రెక్కలు లేకపోతే ఎగురలేదు, బహుజనులకు మీడియా లేకుంటే అభివృద్ధి లేదు
అని చెప్పిన దాన్ని స్ఫూర్తిగా తీసుకుని స్నేహ గ్రూప్ ఆచరిస్తుంది.

స్నేహ గ్రూప్ ఆధ్వర్యంలో మాస్టర్ కి టీవీ ఛానల్ (అంబేద్కర్ టీవీ ఛానల్) ను ,అంబేద్కర్ స్థాపించిన మూక్ నాయక్ పత్రిక 100 సంవత్సరములు ,స్నేహ క్లబ్ 20 సంవత్సరములు సందర్భంగా కేబుల్ ఛానల్ గా ప్రారంభించడం జరిగింది.

బహుజనులు వంద కోట్ల పెట్టుబడి పెట్టి ఛానల్ పెట్టలేరు. కాబట్టి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని 294 అసెంబ్లీ నియోజకవర్గాలలో 294 వ్యక్తులను గాని / సమూహాలను గాని చానల్ ఓనరుగా నియమిస్తూ వారి పెట్టుబడికి నష్టం లేకుండా ,ఆయా నియోజకవర్గాలలో నిజమైన ఓనరుగా హక్కులను ఇస్తున్నాము .

ఈ దిగువ తెలిపిన వ్యక్తులకు /సమూహాలకు నియోజకవర్గ ఓనర్లుగా గా నియమించి హక్కును ఇవ్వడం జరిగింది.

| S.No. | Name of the Content Owner | Contact No. | Name of the Constituency |
|---|---|---|---|
| 1 | N.KOTESHWARA RAO | 9440053858 | MALKAJGIRI ASSEMBLY CONSTITUENCY |
| 2 | G.KENNY BOB | 9490804553 | GOSHAMAHAL ASSEMBLY CONSTITUENCY |
| 3 | B PRABHAKAR | 9347970131 | CHEVELLA ASSEMBLY CONSTITUENCY |
| 4 | AREPALLY RAJENDER | 9440918371 | MANUKONDA ASSEMBLY CONSTITUENCY |
| 5 | N.SATYANARAYANA | 9440956600 | MEDCHAL ASSEMBLY CONSTITUENCY |
| 6 | M.PADMA SARMA | 9440000229 | UPPAL ASSEMBLY CONSTITUENCY |
| 7 | PROF.R.SHYAM SUNDER | 9949979835 | NALAGONDA ASSEMBLY CONSTITUENCY |
| 8 | G.RAMESH | 8332974330 | KOTHAGUDAM ASSEMBLY CONSTITUENCY |
| 9 | KUSUMA BHOGARAJU | 9347350692 | SERLINGAMPALLI ASSEMBLY CONSTITUENCY |
| 10 | G.KENNY BOB | 9490804553 | KARAWAAN ASSEMBLY CONSTITUENCY |

ప్రజాపాలన

సంపాదకీయం

శనివారం 15, అక్టోబరు 2022

## సోషలిస్టుల కొత్త శత్రువు బీజేపీ

21వశతాబ్దంలో భారతీయ సమాజవాద (సోషలిస్ట్) సంప్రదాయం ఉపయుక్తత ఏమిటి? ములాయం సింగ్ యాదవ్ అస్తమయం ఈ గంభీర సమస్యపై ఆలోచనను పురికొల్పుతోంది. సోషలిస్టు ఉద్యమ వ్యవస్థాపకులలో అగ్రగణ్యుడు లోక్ నాయక్ జయప్రకాశ్ నారాయణ్ 120వ జయంతి రోజు (అక్టోబర్ 11)నే ములాయం పార్థివ శరీరానికి అంత్యక్రియలు జరగడం ఒక విశేషం. అలాగే ములాయం రాజకీయ గురువు రామ్ మనోహర్ లోహియా 55వ వర్ధంతికి ఒక రోజు ముందు ఆ కర్మకాండ జరిగిందన్న విషయాన్ని గుర్తు చేసుకోవడం అసందర్భమేమీ కాదు.ములాయం రాజకీయ జీవితంలో స్థిరమైన విషయం ఏదైనా ఒకటి ఉందంటే అది ఆయన మొదటి నుంచీ చివరి వరకు సోషలిస్టు సంప్రదాయ బద్ధుడుగా ఉండడమే. ఆ విశిష్ట సంప్రదాయంతో ఆయన ఎంతగా మమేకమయ్యారంటే తాను స్థాపించిన రాజకీయ పార్టీకి 'సమాజ్‌వాది' అని నామకరణం చేశారు. సోషలిస్టు ఉద్యమ చిహ్నామైన ఎర్ర టోపీని పార్టీ శ్రేణులు నిత్యం ధరించి తీరాలని నిర్దేశించారుబీ ఆంగ్ల భాషా ఆధిపత్యాన్ని తీవ్రంగా వ్యతిరేకించారుబీ సమాజ్‌వాది పార్టీ విధానాలలో లోహియా స్ఫూర్తిని ప్రతిఫలింప చేసేవారు. ఒక్క మాటలో చెప్పాలంటే ములాయం జీవిత పర్యంతం ఒక 'సోషలిస్టు'గా ఉన్నారు. అయితే ఆయన సోషలిజం సారరహితమైనదని పలువురు విమర్శించడం కద్దు. భారతీయ సోషలిస్టు సంప్రదాయం ప్రాసంగికత గురించి ఎందుకు చర్చించాలో ఆ విమర్శలూ ప్రేరేపిస్తున్నాయి మరి. వర్తమాన యువ భారతీయులకు సోషలిస్టు రాజకీయ సంప్రదాయాల గురించి ఏమైనా తెలుసా? సందేహమే. వారికి నిత్యం ఎల్లెడలా 'హిందుత్వే' తటస్థిస్తుంది కదా. ఉదారవాదులు, వామపక్షవాదులు, నక్సలైట్లు, స్త్రీ వాదులు, గాంధేయవాదులు, పర్యావరణ ఉద్యమకారుల గురించి వారు తప్పక వింటూంటారు. అయితే సోషలిస్టుల గురించి అడగండి. వారి నుంచి శూన్య దృక్కులే మీకు ఎదురవుతాయి. మహా అయితే సోషలిజం అనేది కమ్యూనిజంకు ఒక పర్యాయపదమని వారు భావిస్తూండవచ్చు. విద్యాధిక భారతీయులు అయితే బెర్నీ శాండర్స్ (అమెరికన్ రాజకీయవేత్త, రచయిత, ఉద్యమకారుడు)తో ముడివడివున్న విషయంగా భావించే అవకాశముంది. అంతేగానీ, ఆధునిక భారతదేశ నిర్మాణంలో మహోన్నత పాత్ర నిర్వహించిన రామ్ మనోహర్ లోహియా, జయప్రకాశ్ నారాయణ్, ఆచార్య నరేంద్ర దేవ, యూసఫ్ మెహరాలీ, మధులిమాయె, జార్జి ఫెర్నాండెజ్, కిషన్ పట్నాయక్‌లు ప్రభవించిన దేశీయ రాజకీయ సంప్రదాయమే సోషలిజమని వారికి తెలియనే తెలియదు.కమ్యూనిజం కంటే సోషలిజం విలక్షణమైనదని గుర్తించిన వారు సైతం భారతీయ సోషలిస్టు ఉద్యమ విశిష్టతను అర్థం చేసుకున్న వారేమీ కాదు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న డెమోక్రాటిక్ సోషలిస్టులవలే భారతీయ సోషలిస్టులు కూడా పెట్టుబడిదారీ అసమానతలు, కమ్యూనిస్టు నియంతృత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. అయితే ఐరోపాలోనూ మిగతా ప్రపంచంలోని డెమాక్రటిక్ సోషలిస్ట్ పార్టీల వలే భారతీయ సోషలిజం ఏ విధంగాను కమ్యూనిస్టు వామపక్షవాదం లాంటిది కానే కాదు. మహాత్మాగాంధీ నేతృత్వంలో భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న పోరాట యోధులు భారతీయ సోషలిస్టులు. వారి భావాలు, రాజకీయాలను గాంధీ మౌలికంగా ప్రభావితం చేశారు. ఆ స్ఫూర్తిదాయక ప్రభావంతోనే సామాజిక న్యాయంతో కూడిన ఆర్థిక సమానత్వం, రాజకీయ, ఆర్థిక వికేంద్రీకరణ, సాంస్కృతిక విముక్తి, అహింసాత్మక ప్రతిఘటన ఇత్యాది విశిష్ట లక్షణాలతో కూడిన ప్రత్యేక రాజకీయ భావజాలంగా భారతీయ సోషలిజం పరిఢవిల్లింది. మరింత స్పష్టంగా చెప్పాలంటే దేశీయత దాని విశిష్టత. గతించిన కాలం విస్మృత చరిత్రను మనం ఇప్పుడు ఎందుకు గుర్తు చేసుకోవాలి? రాజకీయంగా బలహీనమైన, చీలికలు పీలికలు అయిన సోషలిస్టు ఉద్యమం నేటి అనివార్య ప్రతిఘటనాత్మక రాజకీయాలకు తప్పక తోడ్పడగలిగేదిగా ఉంది. ఇప్పుడు మన ప్రజాస్వామిక గణతంత్ర రాజ్య (రిపబ్లిక్) మనుగడకు ఎదురవుతున్న సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు మూడు మార్గాలను సమకూరుస్తోంది.భారతీయ సోషలిస్టులు సునిశ్చిత జాతీయవాదులు. నిజానికి ఈ జాతీయ వాద దృక్పథమే వారికి, భారత కమ్యూనిస్టు పార్టీకి మధ్య ఉన్న మౌలిక వ్యత్యాసం. భారత స్వాతంత్ర్యోద్యమంతో కమ్యూనిస్టులది రాగద్వేషాల సంబంధం. అయితే సోషలిస్టులు కాంగ్రెస్ నాయకత్వంలో ఆ మహోజ్వల పోరాటంలో సంపూర్ణంగా పాల్గొన్నారు. సోషలిస్టులది ఎంతమాత్రం సంకుచిత జాతీయవాదం కానేకాదు. ప్రగతిశీల భారతీయ జాతీయవాదానికి వారు అగ్రగణ్య ప్రతినిధులు. ప్రపంచవ్యాప్తంగా వలసవాద వ్యతిరేక పోరాటాలతో సంపూర్ణంగా మమేకమయినవారు. స్వాతంత్ర్యానంతరం జాతి%--%నిర్మాణం, మత సామరస్యం, స్వతంత్ర విదేశాంగ విధానానికి సోషలిస్టుల జాతీయవాదం ప్రాధాన్యమిచ్చింది. అయితే 1962 పరాజయం సందర్భంలో నెహ్రూ విదేశాంగ విధానాన్ని విమర్శించేందుకు వారు సందేహించలేదు.ఇప్పుడు భారతీయ జనతా పార్టీ ఇంటా బయటా ఊహాత్మక శత్రువులను చూపుతూ దురహంకార రాజకీయాలకు పాల్పడుతోంది. వాటిని సమర్థించుకునేందుకు జాతీయవాద భావోద్వేగాలను రెచ్చగొడుతోంది. ఉదారవాదులు, వామపక్షాల వారు ఈ సంకుచిత రాజకీయాలను సమర్థంగా ఎదుర్కోలేక పోతున్నారు. బీజేపీ కలహశీల జాతీయవాదాన్ని మీరు అమూర్త అంతర్జాతీయవాదంతో ఎదుర్కోలేరు. ఆ పార్టీ మతోన్మాద జాతీయవాదానికి ప్రభావశీల ప్రతిక్రియ భారతీయ సోషలిస్టుల వాస్తవిక జాతీయవాదమే.సాంస్కృతిక ఆత్మగౌరవ రాజకీయాలు ఆ వాస్తవిక జాతీయవాదానికి సంబంధించినవే. భారతీయ (హిందూ అని చదువుకోండి) నాగరికత, సంస్కృతి బీజేపీ జాతీయవాదానికి ప్రాతిపదికగా ఉన్నాయి. వలసవాద గతాన్ని తుడిచిపెట్టే ప్రతీకాత్మక చర్యల ద్వారా ప్రతి భారతీయుని మద్దతును పొందేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగానే వలసవాద గతంలో ముస్లిం పాలకులను కూడా చేర్చింది! ఇదొక చారిత్రక వంచన. హేతుబద్ధత లేని చారిత్రక అక్రమం. పురాతన భారతీయ సంస్కృతి గొప్పదనాన్ని కీర్తించేందుకు వాస్తవిక, ఊహాత్మక కారణాలను చూపుతోంది. ఆంగ్ల భాష ప్రాబల్యాన్ని త్రోసిపుచ్చడం ద్వారా ప్రజా మద్దతును మరింతగా సమకూర్చుకునేందుకు ప్రయత్నిస్తోంది. బీజేపీ ప్రతీకాత్మకచర్యలు నిస్సారమైనవని, బూటకపు చరిత్రతో ప్రజలను మభ్య పెడుతుందని ఆ పార్టీ విమర్శకులు ధ్వజమెత్తుతున్నారు. అయితే సాంస్కృతిక ఆత్మగౌరవానికి ప్రత్యామ్నాయ కారణాలను వారు చూపడం లేదు. ఆంగ్ల భాషను వారు సమర్థిస్తున్న తీరు వలసవాద ప్రయోజనాల ఆధారితమైనది కానప్పటికీ కులీన వర్గాల స్వప్రయోజనాలకు తార్కాణంగా ఉంటోంది. మన నాగరికతా వారసత్వాన్ని మన సొంత పద్ధతుల్లో బలోపేతం చేసే విధంగా భారతీయ సోషలిస్టులు ప్రతిస్పందించాలి. ఎలా? హిందీ ఆధిపత్యాన్ని అంగీకరించకుండానే ఇంగ్లీష్ ప్రాబల్యాన్ని విమర్శించాలి. ప్రత్యామ్నాయ సాంస్కృతిక రాజకీయాలకు ఇదే సరైన మార్గం. ఒక నాస్తికుడి వలే మతాన్ని తిరస్కరించడం కాకుండా ప్రజల మత మనోభావాలను అర్థం చేసుకుని గౌరవించాలి.

# కులం ఊబిలో భారతం

భారతదేశ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో ఉంది. డా.బి.ఆర్.అంబేద్కర్ రూపొందించిన భారత రాజ్యాంగ సూత్రాలను ఉల్లంఘించడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని మనకు అవగతమౌతుంది. డా.బి.ఆర్.అంబేద్కర్ రాజకీయల్లో వ్యక్తిత్వం, ఆదర్శం, నీతి, నిజాయితీ చాలా అవసరమని చెప్పి ఆయనే స్వయంగా ఆచరించాడు. రాజకీయ నాయకులకు వ్యక్తిత్వం శూన్యమైతే భారత సామాజిక, సాంస్కృతిక వ్యవస్థ సంక్షోభంలో పడక తప్పదు. భారతదేశ వ్యాప్తంగా రాజకీయాల్లో అవినీతి పెరిగింది. అందువల్ల భారతదేశ ఆర్థిక వ్యవస్థలో సింహభాగం రాజకీయ నాయకుల చేతుల్లోకి, కార్పోరేట్ల చేతుల్లోకి, పెట్టుబడిదారుల చేతుల్లోకి సంపద వెళ్లింది. అందువల్ల మన భారతదేశంలో బాలురు ప్రతి పదిమందిలో ఒక్కరు దుర్భరమైన చాకిరీలో ఉన్నారు. వీళ్ళందరిలో ఎస్సీ,ఎస్టీ పిల్లలు తొంబైశాతం అని సర్వేలు చెబుతున్నాయి. ఇప్పటికీ బొగ్గు క్వారిల్లోనూ, హోటళ్లలో, రైల్వే ట్రాక్‌ల మీద కాగితాలు ఏరుకుంటూ విసిరేసిన డబ్బాలు ఏరుకుంటూ కాలే కడుపుతో కళ్ళు పీక్కుపోయి బతుకుతున్నారు. రాజ్యాంగం వీరికి కల్పించిన హక్కులు కాలరాఆయబడుతున్నాయి. భారతదేశాన్ని పట్టి పీడిస్తున్న విషయం నిరుద్యోగం. సంస్కరణలు వృద్ధి రేటును పెంచినట్టు చూపిస్తున్నాయి. కానీ నిరుద్యోగం విస్తృతంగా పెరుగుతుంది. రెగ్యులర్ ఎంప్లాయిస్‌ను తగ్గిస్తూ క్యాజువల్ లేబర్‌ను పెంచుతున్నారు. దానివల్ల ఆర్తిక వ్యవస్థ స్థిరత్వం లేకుండా పోయింది. శ్రామిక సంక్షోభానికి తూట్లు పొడిచాఆరు. ఆర్థిక సంస్కరణలు కుంటుపడడానికి కారణమైన లాకౌట్లు యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల జరిగినవే. సంస్కరణల పేరుతో వ్యవస్థాపకుల భద్రతగా శాశ్వత శ్రామికుల్ని తొలగించి తాత్కాలిక ఉద్యోగుల్ని నియమిస్తూ వస్తున్నారు.శాశ్వత శ్రామిక వర్గాన్ని అంతరింపజేయాలని నమ్మ పోరాటం అనే రాజ్యాంగ సూత్రాలను దెబ్బతీయాలనే పెద్ద ప్రయత్నం జరుగుతుంది. వ్యవసాయ రంగ విస్తరణ తొమ్మిదో ప్రణాళిక నుండి పద్నాలుగో ప్రణాళిక వరకు పరిశీలిస్తే రెండు శాతం దగ్గర స్థబ్ధంగా ఉండిపోయింది. దీనికి కారణం వ్యవసాయ రంగంలో ప్రభుత్వ పెట్టుబడుల శాతం తగ్గిపోయింది. భారతదేశ వ్యాప్తంగా వ్యవసాయరంగానికి సరైన ప్రోత్సాహం లేదు. వరి, గోధుమ వంటి పంటలను ప్రోత్సహించి భూసారాన్ని సహజంగా పెంచే ప్రక్రియకు తిలోదకాలిచ్చారు. దాంతో వ్యవసాయ కూలీలుగా ఉన్న ముప్పై కోట్ల మంది ఎస్సీ, ఎస్టీలకు ఒక్క శాతం భూమి కూడా వారికి ఇవ్వబడలేదు. డా.బి.ఆర్. అంబేద్కర్ భూమిని పంచకుండా ఆర్థిక సామాజిక వ్యవస్థ బలపడదు అని స్పష్టంగా చెప్పాడు. ప్రధానంగా ఎస్సీ,ఎస్టీలకు భూమి పంపకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలన్నీ నిలిపివేశాయి. దానివల్ల దళితుల్లో వ్యక్తిత్వ నిర్మాణం జరగడం లేదు. "భారతదేశంలో నేనొక వ్యక్తినీ, నాదొక కుటుంబం" అనే భరోసా రావాలంటే అది భూమి పంపకంతో సాధ్యమవుతుందని అంబేద్కర్ చెప్పాడు. రైతులు అంటే పంచ కులాలుగానే చెప్పుకోవడంలోనే అన్ని రాష్ట్రాల్లో భూమి కలిగిన ఐదు అగ్ర కులాలుగా చెప్పుకోవడంలోనే నిర్లక్ష్యం దాగి వుంది. డా.బి.ఆర్.అంబేద్కర్ దేశంలోని ఏడు లక్షల గ్రామాల్లో నివసిస్తున్న దళితులందరికీ విద్యుత్ సౌకర్యం ఉచితంగా అందించినప్పుడే వారిలో వెలుగు వస్తుందని చెప్పాడు. ఇప్పటివరకూ నలభై శాతం దళిత వాడల్లో విద్యుత్తు లేదు. ఎస్సీ, ఎస్సీలు చీకటి గుహల్లో జీవిస్తున్నారు. అటువంటి సమయంలో వారి పిల్లలకు విద్యావకాశాలు ఎలా మెరుగు పడతాయని ఈనాటి సామాజిక శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నారు. దళితులను వ్యవసాయ కూలీల నుండి వ్యవసాయ దారులుగా మార్చకపోయినట్లైతే భారతదేశ ఉత్పత్తులు పెరగవు అని అంబేద్కర్ ఆనాడే చెప్పాడు. భారతదేశంలో ఉత్పత్తులు స్తబ్ధతలో ఉండడానికి కారణం దళితులకు భూమీ, నీరూ, విద్యుత్తు, విద్య, ఉద్యోగ, ఉపాధి కల్పనల పట్ల భారతదేశ పాలకులకు ఉన్న నిర్లక్ష్యమే అనేది మనకు స్పష్టంగా తెలుస్తుంది. ఇకపోతే 2017 - 2018 నాటి యునెస్కో లెక్కల ప్రకారం ముప్పై ఐదు శాతం మంది చదవడం, రాయడం రాని వారు భారతదేశంలోనే ఉన్నారు అని లెక్క తేలింది. ఇందులో భారతదేశంలో నిరక్షరాస్యులుగా ఉంది ఎస్సీ, ఎస్టీలే. నిరక్షరాస్యులుగా ఉంచి మత భావాలు, కులభావాలు కలిగించడం ద్వారా ఓట్లు కొల్లగొట్టాలనే రాజకీయ వ్యూహం నుండి దళితులను, దళిత వయోజనులను బయటకు తీసుకు వచ్చినప్పుడే దళిత విద్యార్థుల విద్యాభివృద్ధి చెందుతుందనేది స్పష్టం. ప్రకృతి శక్తులైన దళిత శ్రామిక శక్తుల మీద చూపిస్తున్న భారతదేశ నిర్లక్ష్యం రాజ్యాంగేతర భావజలంతో పెరుగుతుంది. అందుకే డా.బి.ఆర్.అంబేద్కర్ మన ఆర్థిక శాస్త్రంపై బ్రాహ్మణ భావజాలం ఉందని చెప్పారు. అంబేద్కర్ కుల, మతాలను అర్థం చేసుకున్నాక ఆయన ఆర్థిక, రాజకీయ, శాస్త్రాల మొత్తాన్ని ఈ పునాది నుండే చూసారు. మార్క్సిస్టులు ఈ అవగాహన నుండి ఇంతవరకు ఆర్థిక శాస్త్రాన్ని చూడలేకపోయారు. భారతదేశంలో ప్రారంభమైన ఏ విప్లవమైనా అది కులం ఊబిలోనే సతమతమౌతుంది. కులానికి పునాది అయిన మతాన్ని విస్మరించి మన ఉపరితలంలో ఎంత మాట్లాడుకున్నా మూలం ఘనీభవిస్తూనే ఉంటుంది. మళ్లీ భారతదేశాన్ని పునర్నిర్మించాలంటే అంబేద్కర్‌ను అధ్యయనం చేయాల్సిన అవసరం ఇక్కడే తప్పనిసరి అవుతుంది. అంబేద్కర్ ఇలా అన్నాడు. "అధికారంలో ఉన్న వ్యక్తులు దేశ ప్రయోజనాల పట్ల నిర్ద్వంద్వమైన నిబద్ధత కలిగి ఉండేటటువంటి ప్రభుత్వం మనకు రావాలి. న్యాయాన్ని ఇచ్చే సామాజిక, ఆర్థిక నియమావళిని సవరించేటటువంటి ప్రభుత్వం మనకు రావాలి. విప్లవం రక్తపాతం లేనిదైనా, ఉన్నదైనా దాని కారణంగ వచ్చే మార్పు అస్థిరం. ఇకపోతే ఇప్పటికీ ఉద్యోగ వ్యవస్థలో బ్రాహ్మణ బనియాలదే పెద్ద పాత్ర అని ఇ పి డబ్ల్యు భారతదేశ అధికాఆర వర్గ వ్యవస్థ గురించి ఇలా పేర్కొంది. దేశ కార్పోరేట్ బోర్డ్ డైరెక్టర్ల కులాల ప్రకారం బ్రాహ్మణులు 44.6 శాతం, వైశ్యులు 46.0 శాతం, ఎస్సీ, ఎస్టీలు 1 శాతం, బి.సి.లు 3.8 శాతం, తదితరులు 1.5 శాతం ఉన్నట్లు పేర్కొన్నారు. 1989-90లో ప్రభుత్వ సంస్థలు 1160 ఉంటే 2010 నాటికి 21642కు పెరిగాయి. అదే ప్రైవేటు రంగ కంపెనీలు 1990లో రెండు లక్షలు ఉంటే ఇప్పుడు 805 లక్షలకు పెరిగాయి. వాటిలో పెట్టుబడి 64 వేల కోట్ల నుండి 11 లక్షల కోట్లకు పెరిగాయి. ఇప్పుడు ఎస్సీ, ఎస్టీ, బి.సి. మైనారిటీకి ఉద్యోగాలు ఉండవు. భయంకరమైన కుల వివక్ష ఉంది. తాజా అంచనాల ప్రకారం భారత కుబేరుల మొత్తం సంపద జి.డ.పి.లో 15 శాతానికి సమానం. ఐదేళ్ల కిందట ఇది 10 శాతంగానే ఉంది. 2017 నాటికి భారత్‌లో 101 మంది బిలియనీర్‌లు ఉన్నారు. ఆదాయం, వినియోగం, సంపద విషయాల్లో ప్రపంచంలోనే అత్యంత అసమానతలు ఉన్న దేశాల్లో భారత్ ఒకటి. కులం, మతం, ప్రాంతం, లింగ భేదాలతో కునారిల్లుతున్న భారతీయ సమాజానికి ఆర్థిక అసమానతలు మరింత ఆందోళన కలిగించేవే. ఈ ఆర్థిక అసమానతల వల్ల దళిత, బహుజన మైనారిటీల స్త్రీల పరిస్థితి అధోగతి పాలయ్యింది. డా.బి.ఆర్. అంబేద్కర్ ఆర్థిక శ్శా్సంపన్నుడు. ఆయన భారత దేశంలో కులం, అస్పృశ్యత, స్త్రీ వివక్ష పోయినప్పుడు మాత్రమే ఆర్థిక సంపద పెరుగుతుందని చెప్పాడు. ఈ విషయాన్ని ముఖ్యంగా కమ్యూనిస్టులు అర్థం చేసుకోలేకపోయారు. శూద్ర రాజకీయ వేత్తలు భూమి పంచడానికి సిద్ధంగా లేరు. అందువల్ల హిందూ మతోన్మాద రాజకీయ వేత్తలు కులాన్ని, అస్పృశ్యను స్థిరీకరించే క్రమంలో కార్పోరేట్ వ్యవస్థను విస్తృతం చేసి రాజ్యాంగ సూత్రాలు దళితులకు అన్వయం కాకుండా చేసి అస్పృశ్యత భారతాన్ని కొనసాగించాలనే దుర్వ్యూహంలో ఉన్నారు. ఈ సందర్భంగా డా.బి.ఆర్. అంబేద్కర్ కుల, నిర్మూలన, అస్పృశ్యతా నిర్మూలన భావజాలంతో భారతదేశాన్ని ప్రేమించి, భారత దేశంలో ఉన్న ప్రతి పౌరునికి ఆర్థిక స్వావలంబన భాగం కల్పించి, భారతదేశ ఆర్థిక ఉత్పత్తుల్ని పెంచి కుల రహిత గ్రామీణాభివృద్ధి, కుల వివక్షత లేని, స్త్రీ అణచివేత లేని సామాజిక వాదం సమ్మిశ్రతంగా నూత్న ఆర్తిక, సాంఘిక, సాంస్కృతిక విప్లవాన్ని, అంబేద్కర్ మార్గాన్ని నిర్మిద్దాం.



డా॥ కత్తి పద్మారావు
దళిత ఉద్యమ నాయకుడు.
9849741695

# అన్ని రంగాల్లోనూ అమెరికాను దాటేస్తోన్న చైనా

అమెరికా అగ్రరాజ్యంగా ఉన్న ఏకధ్రువ ప్రపంచం అంతరించి, రేపటి ప్రపంచక్రమంలో రష్యా, చైనా శక్తులుగా అవతరించే పరిస్థితులు కనిపిస్తున్నాయి. అమెరికా వేగంగా క్షీణిస్తున్నది. డాలరు ప్రపంచ రిజర్వు కరెన్సీగా తన ఆధిపత్యాన్ని కోల్పోతున్నది. డాలర్ స్థానంలో క్రాస్ బార్డర్ కరెన్సీల మారకం పెరిగింది. షాంఘై సహకార సంఘం (ఎస్.సి.వో)లోని దేశాలన్నీ చైనా కరెన్సీ యువాన్‌తో మారకం ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. చైనా యువాన్ ప్రత్యామ్నాయ కరెన్సీగా ఉద్భవిస్తోంది. కొన్ని దేశాలు యువాన్‌ను డాలరుకు ప్రత్యామ్నాయ రిజర్వు కరెన్సీగా పరిశీలిస్తున్నాయి. కొన్నైతే నేరుగా అమలు చేస్తున్నాయి. మధ్య ఆసియా, మిడిల్ ఈస్ట్, సౌత్ అమెరికాలోని కొన్ని దేశాలు యువాన్‌ను అంగీకరించే సంకేతాలున్నాయి. బ్రెజిల్‌లో వామపక్ష విజయం దక్షిణ అమెరికాలో యువాన్ వ్యాప్తికి ఊపు నివ్వవచ్చు. అనేక ప్రాజెక్టులతో చైనా దక్షిణాఫ్రికా ఖండంలో శక్తిగా ఎదిగినందున యువాన్ వ్యాప్తికి అక్కడా ఆటంకం లేకపోవచ్చు.చాలా రంగాల్లో అమెరికాను చైనా దాటిపోయింది. చైనా ప్రపంచ పారిశ్రామిక కేంద్రంగా ఉంది. నాలుగు దశాబ్దాలలో అత్యాధునిక భారీ ఆర్థిక శక్తిగా, సాఫ్ట్ పవర్‌గా ఎదిగింది. అమెరికాతోపాటు ప్రపంచంలోని అన్ని దేశాలతో భారీ వాణిజ్య మిగులును కలిగి ఉంది. అమెరికా ట్రెజరీ బాండ్స్‌ని చైనా భారీ ఎత్తున కొనుగోలు చేసింది. చైనా విదేశీ మారక ద్రవ్య నిల్వాలు నాలుగు ట్రిలియన్ డాలర్లు. భవిష్యత్తులో కూడా ఇంత భారీ విదేశీ మారక ద్రవ్య నిలువలు, వాణిజ్య మిగులు ఏ దేశమైనా సాధించటం అసాధ్యమేమో. బెల్ట్ అండ్ రోడ్డుతో 160 దేశాలలో అత్యాధునిక భారీ మౌలిక సదుపాయాలను నెలకొల్పుతున్నది చైనా. గ్లోబల్ బిడ్డింగ్‌లో జి-7 దేశాల కంటే తక్కువతో అనేక ప్రాజెక్టులను చేపడుతున్నది. యూరోప్, అమెరికా, అనేక దేశాలలో పశ్చిమ దేశాల సాంకేతికతలను తలదన్నే వంతెనలను నిర్మించింది. ప్రపంచ ప్రథమ ఎక్స్‌పోర్ట్ ఓరియంటెడ్ ఎకానమీగా మూడు దశాబ్దాలుగా కొనసాగుతోంది. ప్రతి సరుకును ఏ దేశం చేయనంత చౌకగా, నాణ్యంగా తయారు చేస్తోంది. చైనా సరుకుల దిగుమతిని నిషేధించిన ఏ దేశమైనా నిలదొక్కుకోవడం కష్టం.అమెరికాతో అన్ని రంగాలలో పోటీ పడే సాంకేతికతలను చైనా సాధించింది. ప్రపంచ మౌలిక సదుపాయాల కల్పనలో ఏ పశ్చిమ దేశమూ నేడు చైనాతో పోటీ పడే స్థాయిలో లేదు. పాసెంజర్స్ వాహనాలలో అమెరికాను అధిగమించింది. న్యూ ఎనర్జీ వాహనాలలో ప్రపంచ మార్కెట్లో చైనా వాటా 60 శాతం దాటింది. 5జి టెక్నాలజీలోనూ అన్ని దేశాలనూ అధిగమించింది. చైనా హువావేను అమెరికా అడ్డుకునే ప్రయత్నాలన్నీ ప్రపంచమంతటా విఫలమయ్యాయి. అంతరిక్ష పరిశోధనలోనూ చైనా ముందంజలో ఉంది. 1971 ఆగస్టు 15న అమెరికా అధ్యక్షుడు నిక్సన్ డాలరు-గోల్డు మార్పిడిని రద్దు చేసారు. నాటి నుంచి నేటి వరకు అమెరికా ఆర్థిక వ్యవస్థ బలంతో సంబంధం లేకుండా పేపరు డబ్బును భారీ ఎత్తున ముద్రించి ప్రపంచమంతా పంపిణీ చేస్తున్నది. నాటి నుంచి అమెరికా ఆర్థిక వ్యవస్థ లోటు భారీగా పెరుగుతూనే ఉంది. మిగులులో లేదు. యుద్ధాలు, ఆంక్షలు, హామీలతో డాలరు ప్రపంచాధిపత్యాన్ని సంపాదించింది. ఒత్తిడితో, కృత్రిమ బలంతో డాలరు పెరిగింది. అమెరికా అప్పు 28 ట్రిలియన్ డాలర్లకు చేరినా, డాలరు ప్రపంచ రిజర్వు కరెన్సీగానే కొనసాగింది.



ట్రెజరీ బాండ్స్ పేరిట, చైనా తదితర అనేక దేశాలకు అమెరికా భారీగా అప్పు పడి ఉంది. ఇది పరస్పర విరుద్ధం.పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా చెల్లింపులు, పెట్టుబడులు, ఫైనాన్సింగ్‌తో విదేశీ మారక ద్రవ్యంగా ప్రపంచంలో చైనా కరెన్సీ రెన్‌మిన్‌బి (ఆర్.ఎం.బి.) పాత్ర పెరుగుతోంది. చైనా ప్రభుత్వ కంపెనీలు విదేశీ భాగస్వాములతో భారీ వాణిజ్య ఒప్పందాలన్నీ అధికమైన ఖర్చయ్యే డాలరుతో గాక ప్రధానంగా ఆర్.ఎం.బి.తో జరుపుతున్నాయి. చైనా కేంద్ర బ్యాంకు నివేదిక ప్రకారం వివిధ దేశాలతో రెన్‌మిన్‌బి బ్యాంకేతర రసీదులు చెల్లింపులు 36.6 ట్రిలియన్ యువాన్‌లు (5.1 ట్రిలియన్ డాలర్స్) జరిగాయి. రెన్‌మిన్‌బితో పెట్టుబడి అవకాశాలు, వైవిధ్యపూరిత ప్రయోజనాలు పెరుగుతాయని నిపుణుల విశ్లేషణ. 7వ చైనా-యూరేసియా ఎక్స్‌పో జరిగినప్పుడు మధ్య ఆసియా సరిహద్దు వాణిజ్యం మొత్తం యువాన్‌లో జరపాలని నిర్ణయించారు. మరిన్ని ఎక్కువ ఒప్పందాలు, ఏర్పాట్లు మరిన్ని దేశాలతో చేసుకోవాలని నిర్ణయించారు. చైనా కేంద్ర బ్యాంకు, కజికిస్థాన్ కేంద్ర బ్యాంకులు సంయుక్తంగా యువాన్ మారకానికి అడ్డంకులు తొలగించాయి. ఈ యూరేసియా ఎక్స్‌పోలో చైనా యువాన్ అనేక దేశాలతో కమొడిటీ ఒప్పందాలు చేసుకుంది. ఉజ్బెకిస్తాన్, బెలారస్‌లు కూడా డాలర్ బదులుగా యువాన్‌తో కలప, ఖనిజాలు, వినియోగ వస్తువుల భారీ ఒప్పందాలను చేసుకున్నాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల మధ్య కూడా యువాన్ ఒప్పందాలు పెరుగుతున్నాయి. డాలరు ఎగబాకుతున్న కాలంలో ప్రపంచంలో యువాన్ స్థిరత్వం రీత్యా బెల్ట్ అండ్ రోడ్ వెంట అనేక దేశాలు యువాన్ మారకానికి ముందుకు వస్తున్నాయి. బహుళ ధ్రువప్రపంచం, ప్రత్యామ్నాయ రిజర్వు కరెన్సీ ప్రపంచ మానవాళికి కొత్త వెలుగును, శాంతిని, సుసంపన్నతను కలిగిస్తాయని ఆశిద్దాం.

## రుద్ర సహిత నవ చండీయాగం మహెూత్సవ బ్రోచర్ను ఆవిష్కరించిన జడ్పిటిసి కామిరెడ్డి శ్రీలత





బూర్గంపాడు మండలం ( ప్రజా పాలన.). బూర్గంపాడు మండలం సారపాక నందు జరిగినటువంటి కార్యక్రమంలో జడ్పిటిసి కామిరెడ్డి శ్రీలత ముఖ్య అతిథిగా పాల్గొని రుద్ర సహిత నవ చండీయాగం మహెూత్సవ బ్రోచర్ను సారపాక నందు ఆవిష్కరించడం జరిగినది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహా చండీయాగం నిర్వహించడం ప్రజలకు ఎంతో మంచిదని గ్రామ పెద్దలు అందరూ కూడా పూనుకొని ఈ బృహత్తర కార్యక్రమాన్ని సారపాక నందు మూడు రోజులపాటు నిర్వహించడం జరుగుతుందని వారు అన్నారు. ప్రజలందరూ కూడా సుఖ సంతోషాలతో ఉండాలని అంతేకాకుండా ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఉద్దేశంతోనే ఇటువంటి బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని దీనికి ప్రతి ఒక్కరు సహాయ సహకారాలు కావాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో బూర్గంపాడు టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు సుబ్రహ్మణ్యం జగదీష్ ,కామేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, నాగేంద్ర శర్మ, రఘుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక స్థాయిలోనే మెరుగైన విద్య అందించాలిజిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య



మధిర అక్టోబర్ 14 (ప్రజా పాలన ప్రతినిధి) ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలోనే మెరుగైన విద్యను అందించాలని ఖమ్మం జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య సూసించారు. శుక్రవారం స్థానిక సిపిఎస్ పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మరియు సిఆర్పిల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు అర్థమయ్యే విధంగా ఉపాధ్యాయులు విద్యా బోధన చేయాలన్నారు. ఈనెల 15వ తేదీ నుండి 31వ తేదీ వరకు నిర్వహించే ప్రాథమిక పాఠశాలల మానిటరింగ్ ప్లానింగ్ గురించి మండల నోడల్ అధికారి ప్రభుదయాల్ ని అడిగి తెలుసుకున్నారు. మండలంలో 40 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయని అన్నింటిని ఈనెల 31 లోపు సందర్శించేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు నోడల్ అధికారి వివరించారు. సందర్శన సమయంలో సీ గ్రేడ్ విద్యార్థులపై, తరగతి బోధనపై ప్రత్యేక దృష్టి సారించాలని, తరగతిగది బోధన ప్రణాళిక ప్రకారం జరగాలని ఆయన సూచించారు. అన్ని పాఠశాలల్లో శనివారం పేరెంట్ టీచర్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహిస్తూ సీ గ్రేడ్ విద్యార్థుల పట్ల తల్లిదండ్రులతో చర్చించాలని ఆయన సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన సూచనలను విధిగా పాటించాలన్నారు. ఈ సమావేశంలో మండల విద్యాధికారి ప్రభాకర్ స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నారాయణ, విజయశ్రీ ఉపాధ్యాయులు బావ్ సింగ్ మరియు సిఆర్పిలు పాల్గొన్నారు.

## టపాసుల షాపుల ఏర్పాటు కోసం స్థల పరిశీలన



మధిర అక్టోబర్ 14 (ప్రజా పాలన (ప్రతినిధి) దీపావళి పర్వదినం సందర్భంగా ఏర్పాటు చేయుబోయే బాణాసంచా దుకాణాల కోసం కావలసిన స్థలాన్ని శుక్రవారం మధిర సీఐ మురళి తహసీల్దార్ రాంబాబు కమిషనర్ అంబటి రమాదేవి పరిశీలించారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం బాణాసంచా దుకాణాలను జనసంచారం లేని విశాలమైన ప్రదేశంలో ఏర్పాటు చేయాల్సి ఉంది. పట్టణంలో దుకాణాలన్నిటిని ఒకే చోట ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో అధికారులు ఖాళీగా ఉన్న మధిర మార్కెట్ యార్డులోని ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. ఈ ప్రాంతంలో దుకాణాలు ఏర్పాటు చేయటం వల్ల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని, పార్కింగ్ కూడా అనుకూలంగా ఉంటుందని అధికారులు కూడా ఒక అంచనాకి వచ్చినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సతీష్ కుమార్, టౌన్ ప్లానింగ్ అధికారి రమేష్, ఫైర్, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## కోనా సుబ్బారావు సేవలు మరువలేనివి



మధిర అక్టోబర్ 14 (ప్రజాపాలన ప్రతినిధి) కోన సుబ్బారావు సేవలు మరువలేనివని జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు పేర్కొన్నారు. శుక్రవారం మధిరలోని కోన జగదీష్ నివాసంలో ఏర్పాటుచేసిన కోనా సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన కుమారుడు కోన జగదీష్ ని పరామర్శించారు. ఆయన వెంట టిఆర్ఎస్ మండల పట్టణ అధ్యక్షులు రావూరి శ్రీనివాసరావు కనుమూరి వెంకటేశ్వరరావు వైవి అప్పారావు అరిగే శ్రీనివాసరావు కొఠారి రాఘవరావు జేవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ న్యాయవాదులను సన్మానించిన కురుమ సంఘం ప్రతినిధులు



మేడిపల్లి, అక్టోబర్ 14 (ప్రజాపాలన ప్రతినిధి): ఉప్పల్ నియోజకవర్గం కురుమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా తెలంగాణ రాష్ట్ర ప్రభత్వాంచే నియమితులైన కురుమ న్యాయవాద సోదరులను సంఘం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఉప్పల్ బీరప్పగడ్డ శ్రీ శ్రీ శ్రీ బీరప్ప స్వామి దేవాలయంలో ఉప్పల్ నియోజకవర్గ మరియు ఉప్పల్ కురుమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర కురుమ సంఘం ఉపాధ్యక్షులు గొరిగే రమేష్ కురుమ, ఉప్పల్ నియోజకవర్గం కురుమ సంఘంం అధ్యక్షులు రేవు కృష్ణయ్య కురుమ, ప్రధాన కార్యదర్శి చౌదరపల్లి పర్వతాలు కురుమ, ఉప్పల్ కురుమ సంఘంంం అధ్యక్షులు గొరిగె ఐలయ్య కురుమ, రాష్ట్ర కురుమ సంఘం ఉపధ్యక్షులు కొండల్ రాజు కురుమ నూతనంగా ఎన్నికైన కురుమ న్యాయవాదులు హైకోర్టు స్టాండింగ్ కౌన్సిల్, వైద్యావిధాన పరిషత్ ఎస్ విజయ్ ప్రశాంత్ కురుమ, హైకోర్టు స్టాండింగ్ కౌన్సిలు, ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా గొరిగే మల్లేష్ కురుమ, జక్కుల వంశీ కృష్ణ కురుమ ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా ఏ జి పి, ఐయిల్ల కొమురయ్య కురుమ జిహెచ్ఎంసి స్టాండింగ్ కౌన్సిల్ లను గొంగడి, రుమాలు, పూలమాల శాలువా, డోలు తలలుతో ఘనంగా సన్మానించారు. తెలంగాణా కలమండలి పాట రాజశ్రీ మహేష్ కురుమలు పాటలు పాడారు. ఈ కార్యక్రమంలో వందలాది కురుమలు,కురుమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## మునుగోడు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాల్వాయి స్రవంతి నామినేషన్ లో పాల్గొన్న రాగిడి లక్ష్మారెడ్డి



మేడిపల్లి, అక్టోబర్ 14 (ప్రజాపాలన ప్రతినిధి): మునుగోడు ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గం నుండి భారీ ఎత్తున కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మునుగోడుకు తరలి వెళ్ళారు. మునుగోడు చండూరుకు వెళ్లిన రాగిడి లక్ష్మారెడ్డికి ఆయా గ్రామల కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు స్వాగతం పలికారు. అనంతరం బైక్ పై ర్యాలీగా బయలుదేరి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, మాజీ టీపీసీసీ చీఫ్ ఉత్తంకుమార్ రెడ్డితో కలిసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాల్వాయి స్రవంతి నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాచారం డివిజన్ ఇంచార్జ్ మేడల మల్లికార్జున్ గౌడ్, మీర్పేట్ హౌసింగ్ బోర్డ్ డివిజన్ ఇంచార్జ్ పోలిపాక అంజయ్య, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ పత్తి కుమార్, స్టేట్ జనరల్ సెక్రెటరీ కాంగ్రెస్ సేవాదళ్ సద్గుణ రావు ,మహిళా కాంగ్రెస్ నాయకురాలు లక్ష్మి, రామంతపూర్ డివిజన్ ఇంచార్జ్ తవిడబోయిన గిరిబాబు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సుధాకర్ శెట్టి, నెమలి అనిల్ , సీనియర్ కాంగ్రెస్ నాయకులు సంజయ్ జైన్, జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ కరిపే సంతోష్, కాంగ్రెస్ నాయకులు షబ్బీర్ ,భాను, ఎండి రిజ్వాన్ రమేష్ నాయక్, కిషన్ నాయక్ ,మల్లికార్జున్, నవీన్ ,చందు యాదవ్, మల్లేష్ ,గొల్లూరి ప్రభాకర్ ,కరిపే మల్లికార్జున్, రాజేష్ జహీర్, చుక్కల స్వామి, తదితరులు పాల్గొన్నారు.

## గుడిసెల పోరాటం నికి మద్దతు: సీపీఎం రాష్ట కార్యదర్శి వర్గ సభ్యులు జాన్ వెస్లీ



ఇబ్రహీంపట్నం అక్టోబర్ తేదీ 14 ప్రజాపాలన ప్రతినిధి:అబ్దుల్లాపూర్మెట్ గ్రామంలో సర్వేనెంబర్ 283 గుడిసెలు వేసుకున్న వారికి మద్దతు తెలియజేస్తూ తెలంగాణ సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్ వెస్లీ , సిపిఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పగడాల యాదయ్య . కెవిపిఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బొడ, సామిల్ , గుడిసెలు వేసుకున్న నిరుపేదలను, వారి దగ్గరికి వెళ్లి వారికి మద్దతు తెలియజేస్తూ, గుడిసె వాసులందరికీ , ఈ తెలంగాణ ప్రభుత్వం వారికి న్యాయం చేయాలని, వారందరి కూడా పట్టా సర్టిఫికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇదే సర్వే నెంబర్ లో వందలాది ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతున్న పట్టించుకునే నాధుడు లేడు, పేదలు మాత్రం, 60 గజాలు కావాలని గుడిసెలు వేసుకుంటే ఈ ప్రభుత్వం వాళ్లు, కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు, అబ్దుల్లాపూర్ గ్రామంలో గుడిసెలు వేసుకున్న పేదవారికి న్యాయం జరిగేంత వరకు వీరికి అండగా ఉంటామని, ఈ తెలంగాణ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇవ్వద్దని 493 జీవోను రద్దు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్లాపూర్ మెట్టు మండల కార్యదర్శి ఏర్పుల నరసింహ, సిపిఎం మండల కమిటీ సభ్యులు గుండె శివ కిరణ్, మైసమ్మ లలిత, శివ, అనిత రామా దేవి, పాల్గొన్నారు. జాన్ వెస్లీ . గుడిసెలు వేసుకున్న వారిని గుడిసెలను పరిశీలించడం జరిగింది.

## కామ్రేడ్ టి.ఎన్. వెంకటరమణ సంస్మరణ సభ



మంచిర్యాల టౌన్, అక్టోబర్ 14, ప్రజాపాలన :కామ్రేడ్ టి.ఎన్. వెంకటరమణ సంస్మరణ సభ తెలంగాణ ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం రోజున మంచిర్యాల జిల్లా కేంద్రంలోని చార్వక హాల్ లో దుంపల రంజిత్ కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. అనంతరం ప్రజా సంఘాల ఉద్యమ నిర్మాత కామ్రేడ్ వెంకటరమణ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలు సంఘాల నాయకులు మాట్లాడుతూ టి.ఎన్. వెంకటరమణ సిర్పూర్ పేపర్ కంపెనీలో ఇంజనీర్ గా ఉద్యోగం చేస్తున్న సందర్భంలో ప్రజలు ఎదుర్కొంటున్నా సమస్యల పరిష్కారం కొరకు ప్రజలు చైతన్య వంతులుగా మార్చడం కొరకు తన ఉద్యోగాన్ని సైతం వదిలేసి, ప్రజల సమస్యలు అధ్యయనం చేస్తూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో విద్యార్థి, యువజన, కార్మిక సిపిఎం పార్టీ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు అని కొనియాడారు. ఈ మధ్య కాలంలో అనారోగ్య సమస్యల వలన ఆయన మరణించారు అని అన్నారు. ఆయన ఆశయాల కోసం పాటు పడాలని , ఆయన స్పూర్తితో జిల్లాలో ప్రజా సంఘాలను నిర్మాణం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు , సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి సంకె రవి, సామాజిక న్యాయ వేదిక జిల్లా కన్వీనర్ రంగు రాజేశం,తదితరులు పాల్గొన్నారు.

## దళిత సంఘాల ఆద్వర్యంలో ర్యాలీని విజయవంతం చేయాలి



జన్నారం, అక్టోబర్ 14, ప్రజాపాలన: నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలో దళిత సంఘాల ఆద్వర్యంలో శనివారం జరిగే ర్యాలీని విజయవంతం చేయాలని జన్నారం మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు సిటిమల భరత్ కూమర్ అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖానాపూర్ నియోజకవర్గంలోని వివిధ మండలల దళితులు పాల్గొని భారీ ర్యాలీ నిర్వహించాలని అయన కోరారు. ఇటివల పెంబి మండలంలో నిరుపేద దళితులపై కొందరు వివిధ ఉన్నత వర్గాల వారు చేసిన అఘాయిత్యాలకు నిరసనగా దళిత సంఘాల సభ్యుల హజరై ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించ్చాలని అయన కోరారు. ఈ కార్యాక్రమంలో బోర్లకుంటా ప్రభూదస్, ఇందయ్య, దళితులు, తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలి: డాక్టర్ సుబ్బారావు



మధిర రూరల్ అక్టోబర్ 14 (ప్రజా పాలన ప్రతి నిధి) ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా క్షయ నివారణ అధికారి మరియు మధిర డివిజన్ ప్రత్యేక అధికారి డాక్టర్ వరికూటి సుబ్బారావు సూచించారు. శుక్రవారం పట్టణంలో పలుచోట్ల నిర్వహిస్తున్న డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నివాస ప్రాంతాల్లో వర్షపు నీరు నిలవ లేకుండా ప్రజలు ఉంచుకోవాలన్నారు. అదేవిధంగా నివాసాల్లో పాడైపోయిన కూలర్లు వాడేసిన కొబ్బరి బోండాలు టైర్లను తొలగించుకోవాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఎటువంటి సీజనల్ వ్యాధులు దరి చేరవన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్సి ఆరోగ్య సిబ్బంది పిహెచ్ఎన్ గోలి రమాదేవి హెచ్ఇఒ గోవింద్ మాతా శిశు సంరక్షణ నోడల్ పర్సన్ కౌసెల్య టీబీ ఎయిడ్స్ లెప్రసీ నోడల్ పర్సన్ లంకా కొండయ్య ఎఎన్ఎమ్లు విజయలక్ష్మి విజయ కుమారి హెల్త్ అసిస్టెంట్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పత్తిపాక లో తెరాస గడపగడపకు ప్రచారం



కోరుట్ల, అక్టోబర్ 14 (ప్రజాపాలన ప్రతినిధి ): మునుగోడు నియోజకవర్గంలోని పత్తిపాక గ్రామంలో టీఆర్ఎస్ అభ్యర్థి ప్రభాకర్ రెడ్డి గెలుపు కోసం శుక్రవారం కోరుట్ల పట్టణ టిఆర్ఎస్ యూత్ ఉపాధ్యక్షుడు బలిజ శివప్రసాద్ కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు ఆదేశాల మేరకు పత్తిపాక గ్రామంలో గడపగడపకు తిరుగుతూ ప్రచారం నిర్వహించారు .ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వృద్ధులకు, మహిళలకు, వితంతువులకు ఒంటరి మహిళలకు, బీడీ కార్మికులకు ఆసరా పెన్షన్లు అందించిన ఘనత కేసిఆర్ దేనని తెలిపారు. గ్రామంలోని ప్రజలు టిఆర్ఎస్కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారన్నారు.కెసీఆర్ ను పెద్ద కొడుకు అని అంటున్నారని ఆయన తెలిపారు . ఆయన వెంట గ్రామ టిఆర్ఎస్ ఉపాధ్యక్షుడు యాదగిరి, సోషల్ మీడియా ఇన్చార్జి ఆదిత్య, జాల నరసింహ, తడక వెంకటేశ్వర్లు, సిపిఎం కార్యకర్తలు ముంత సాయి, భాస్కర్ తదితరులు ఉన్నారు.

## ప్రెస్ క్లబ్ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ



బెల్లంపల్లి అక్టోబర్ 14 ప్రజాపాలన ప్రతినిధి: బెల్లంపల్లి పట్టణంలోని బాబు క్యాంపు ప్రెస్ క్లబ్ కు శనివారం జరగనున్న ఎన్నికలకు నామినేషన్లను స్వీకరిస్తున్న అడుహక్ కమిటీ సభ్యులు.ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ శుక్రవారం నామినేషన్ల స్వీకరణ, ఉపసంహరణ ఉంటుందని, శనివారం ఉదయం 11 గంటల నుండి మూడు గంటల వరకు స్థానిక పద్మశాలి భవన్లో ఎన్నికలు నిర్వహించి, అనంతరం ఫలితాలు ప్రకటిస్తామని, ఎన్నికలు మందమర్రి, కాసిపేట, భీమిని, మండలాలకు చెందిన సీనియర్ రిపోర్టర్ల ఆధ్వర్యంలో నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రాజశేఖర్, కిరణ్, రమేష్, సుభాన్, పవన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మునుగోడు ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థికి మద్దతుగా మంత్రి మల్లారెడ్డి మేయర్లు కార్పొరేటర్ ప్రచారం



మేడిపల్లి, అక్టోబర్ 14 (ప్రజాపాలన ప్రతినిధి) :మునుగోడు ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా టీఆర్ఎస్ అభ్యర్థి ప్రభాకర్ రెడ్డికి మద్దతుగా మునుగోడు నియోజకవర్గం అర్రేగూడెం గ్రామంలో మంత్రివర్యులు చామకూర మల్లారెడ్డి,పీర్జాదిగూడ కార్పొరేషన్ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, డిప్యూటీ మేయర్ కూర శివకుమార్ గౌడ్, కార్పొరేటర్ డాక్టర్ సుభాష్ నాయక్ లు ఇంటింటా ప్రచారం నిర్వహిస్తూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ, కారు గుర్తుకు ఓటు వేసి టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డిని గెలిపించాలని ఓటరును అభ్యర్థిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కర్రే బలరాం, జయందర్, వరకాల శ్రీనివాస్, మల్లేష్ గౌడ్, సోమిరెడ్డి, కట్ట రాజు తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనంలో పౌష్టికాహారం అందించాలి

**వికారాబాద్ జిల్లా కలెక్టర్ నిఖిల**



వికారాబాద్ బ్యూరో 14 అక్టోబర్ ప్రజా పాలన : ప్రతి పాఠశాలలో మధ్యాహ్న భోజనం, అంగన్వాడీ కేంద్రాలలోని పిల్లలకు, బాలింతలకు పౌష్టిక ఆహారం అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ నిఖిల అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయం లోని సమావేశ మందిరములో ప్రపంచ ఆహార దినోత్సవం -2022 సందర్భంగా ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సమావేశంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ, ఆహార కొరత లేకుండా ప్రతి ఒక్కరికి పౌష్టిక ఆహారం అందించడం జరుగుతుందన్నారు. ఏ ఒక్క పౌరుడు ఆకలితో ఉండవద్దనే ఉద్యేశ్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ కార్డులు అందించి ఆహారం అందించడం జరుగుతుందని తెలిపారు. ఆహారం దుర్వినియోగం కాకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్త వహించాలని, దాని విలువను గుర్తించలన్నారు. అలాగే అంగన్వాడీ కేంద్రాలలోని పిల్లలకు భవిష్యత్ లో మంచి పౌరులుగా తీర్చిదిద్దడానికి పౌష్టిక ఆహారం అందించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆహార భద్రత చట్టంపై రేషన్ డీలర్లకు, రేషన్ కార్డు లబ్ధిదారులకు, అంగన్వాడీ టీచర్లు విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగినది. అనంతరం ప్రపంచ ఆహార దినోత్సవంపై పాఠశాల విద్యార్థులు, పంచాయతీ సెక్రటరీలు, అంగన్వాడీ టీచర్లకు నిర్వహించిన వ్రకృత్వ, వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విజేతలకు జిల్లా కలెక్టర్ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి అశోక్ కుమార్, డి ఆర్ డి ఓ కృష్ణన్, జిల్లా పౌర సరఫరాల అధికారి రాజేశ్వర్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లలితా కుమారి, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ విమల, జిల్లా విద్యా శాఖ అధికారి రేణుక దేవి, ఆర్ డి ఓ విజయకుమారి, రేషన్ డీలర్లు, రేషన్ కార్డు లబ్ధిదారులు, అంగన్వాడీ టీచర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 16న గ్రూప్ వన్ ప్రిలిమినరీ పరీక్ష: వికారాబాద్ జిల్లా కలెక్టర్ నిఖిల



వికారాబాద్ బ్యూరో 14 అక్టోబర్ ప్రజా పాలన : అక్టోబర్ 16న తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించు గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష జిల్లాలో సజావుగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ నిఖిల తెలిపారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ నిఖిల అధ్యక్షతన గ్రూప్ వన్ పరీక్షల నిర్వహణ పాటించవలసిన నియమ, నిబంధనల విషయమై చీఫ్ సూపరింటెండెంట్ లకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలో మొత్తం 14 పరీక్షా కేంద్రాల్లో 4857 మంది పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. పరీక్షలు బయో మెట్రిక్ హాజరు దృష్ట్యా ఉదయం 8-30 గంటల నుండి పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉంటుందని, 10 గంటల 15 నిమిషాల తర్వాత పరీక్షా కేంద్రంలోనికి ఎట్టి పరిస్థితిలో అనుమతి ఉండదని తెలిపారు. హాల్ టికెట్ తో పాటు బ్లూ/బ్లాక్ పాయింట్ పెన్, ప్రభుత్వ గుర్తింపు కార్డ్ లలో (పాన్ కార్డు ,ఓటర్ కార్డ్, ఆధార్ కార్డ్ ,డ్రైవింగ్ లైసెన్స్ పాస్ పోర్ట్) ఏదైనా ఒకటి తీసుకొని రావాలని సూచించారు. హాల్ టికెట్ పై ఫోటో సరిగ్గా ప్రింట్ కాని అభ్యర్థులు గెజిటెడ్ అధికారితో సంతకం చేసిన 3 పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలతో పరీక్ష కేంద్రాలకు హాజరు కావాలని తెలిపారు. పరీక్ష కేంద్రంలో రైటింగ్ ప్యాడ్ లు, మొబైల్ ఫోన్, క్యాల్క్యులేటర్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి ఉండదని, తీసుకొచ్చినట్లయితే ఇట్టి వస్తువులను భద్రపర్చుటకు ఒక ప్రత్యేక గదిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులు చెప్పులు మాత్రమే ధరించాలి, షూ ధరించి రావద్దనీ సూచించారు. ఓఎంఆర్ జవాబు పత్రంపై వైట్నర్/చాక్ పవర్/బ్లేడ్/ఎరేజర్ ఉపయోగించడం నిషేధమని, పరీక్ష పూర్తయ్యే వరకు అభ్యర్థులెవరు పరీక్ష హాల్ నుండి బయటకు వెళ్లడానికి అనుమతించబడరని సూచించారు. పరీక్ష కేంద్రాలలో అభ్యర్థులకు బెంచీలు, టేబుల్స్, ఫ్యాన్లు, నిరంతర విద్యుత్, త్రాగు నీటి సదుపాయం, స్త్రీ పురుషులకు విడివిడిగా టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని చీఫ్ సూపరింటెండెంట్ లను ఆదేశించారు. బయోమెట్రిక్ తరువాతనే అభ్యర్థులకు లోపలికి వదలాలని సూచించారు. చీఫ్ సూపరింటెండెంట్ రూంలో ప్రవేశ ద్వారం వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, దానితో పాటు వీడియో కెమెరాలు ఏర్పాటు చేసి పరీక్ష మొదలు నుండి పూర్తి అయ్యే వరకు రికార్డు చేయాలన్నారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్రూప్ -1 పరీక్షలను ఎలాంటి తప్పులు దొర్లకుండా విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి అశోక్ కుమార్, ఆర్ డి ఓ విజయకుమారి, పరీక్షా నిర్వహణ పర్యవేక్షకుడు రవీందర్ దత్తు, పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లు, టి ఎస్ పి ఎస్ సి ప్రతినిధులు సుష్మ, జయభారతి తదితరులు పాల్గొన్నారు.


ప్రజాపాలన

జాతీయ తెలుగు దినపత్రిక తెలుగురాష్ట్రాల్లో విస్తృత పర్చేందుకు మా బిజినెస్ అసోసియేట్స్‌ను మీకు పరిచయం చేస్తున్నాం. దిగువ ఇవ్వబడిన బిజినెస్ అసోసియేట్స్ 'ప్రజాపాలన' జాతీయ తెలుగు దినపత్రికలో వార్తా సంబంధ విషయాల్లో ప్రకటనలు స్వీకరించేందుకు,ప్రజాపాలన దిన పత్రిక చందా విషయమై ఎప్పుడూ మీకు అందుబాటులో ఉంటారు.

**బిజినెస్ అసోసియేట్స్-టెలిఫోన్ నెంబర్లు**

| | | |
|---|---|---|
| నరోత్తమ్‌రెడ్డి | మేడిపల్లి | 9346970159 |
| వెంకటస్వామి | మంచిర్యాల | 9515048103 |
| ఎం. గైబులు | వికారాబాద్ | 9704570475 |
| టి.రాంబాబు | శేర్లింగంపల్లి | 6301925113 |
| సత్య కిషోర్ | అమీర్‌పేట | 6309723472 |
| బోడ మనోహర్ నంద | కరీంనగర్ | 9492927684 |
| రాజేందర్ ప్రసాద్ | ఖమ్మం | 7013953536 |
| పి.ఎన్.శ్రీనివాస్ | మధిర | 9030821362 |
| గంజిగుంట్ల వెంకన్న | పాలేరు | 9848895405 |
| పసుపులేటి ఈశ్వర్‌తేజ | మధిర రూరల్ | 6305269141 |
| ఆర్.శ్రీనివాస్ | ఎర్రుపాలెం మండలం | 8501020885 |
| బుక్య.శ్రీను | బోనకల్ | 8688810293 |
| సి.మల్లేష్ | ఇబ్రహీపట్నం | 9618028334 |
| దుంపాల రాజేష్ | మేడ్చల్ | 9000178307 |
| వై.నర్సింహులు | తాండూరు | 7207677049 |
| డి.ప్రవీణ్ కుమార్ | కొడంగల్ | 9866027635 |
| టి.సురేష్ చారీ | ఆసిఫాబాద్ | 9000983108 |
| డి.భాస్కర్ | బెల్లంపల్లి | 9440018863 |
| ఐ.నర్సింహయ్య | జన్నారం రూరల్ | 9493314399 |
| గొట్టె సురేందర్ | మంచిర్యాల టౌన్ | 9248528680 |
| గొర్లబాబూరావు | తల్లాడ | 9848236015 |
| ఎల్.వెంకట్ | మందమర్రి | 8106891666 |
| మహమ్మద్ హాఫీజుద్దీన్ | కేతనపల్లి | 9701844456 |
| సాయిబాబు | భద్రాద్రి కొత్తగూడెం | 9603149645 |
| ఎన్.బండయ్య | చేవెళ్ల | 9959032940 |
| నరేందర్ | చేవెళ్ల | 9490148304 |
| ఎం.పరమేష్ | శంకరపల్లి | 7989723793 |
| ఊదిరి మహేష్ | చౌటుప్పల్ | 9550941419 |


## క్షయ వ్యాధి నివారణపై క్యాంపు



ఇబ్రహీంపట్నం,అక్టోబర్ 14 (ప్రజాపాలన ప్రతినిధి): మండలంలోని వర్షకొండ గ్రామంలో ఆక్టివ్ కేస్,(టిబీ ) డిటెక్షన్ (తెమడపరీక్ష) క్యాంపును నిర్వహించారు. ఇందులో 27 మంది నుండి తెమడ పరీక్ష నమూనాలను సేకరించి పరీక్షకు పంపించడం జరిగింది.క్షయ వ్యాధి నివారణ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు,డాక్టర్ వనజ,హెచ్ ఈ వెంకటేశం వ్యాధి లక్షణాలను వివరిస్తూ రెండు వారాల పైబడి దగ్గు, సాయంత్రం పూట జ్వరము,ఆకలి మందగించడం, బరువు తగ్గడం తదితర లక్షణాలు ఉన్నవారిని ప్రభుత్వ ఆసుపత్రికి పంపినట్లయితే తెమడ పరీక్షలో క్షయ నిర్ధారణ అయినట్లయితే ప్రభుత్వ ఆసుపత్రి నుండి డాట్స్ ద్వారా ఉచితంగా మందులు అందజేయడం జరుగుతుందని అన్నారు. నిక్షయ్ పోషన్ యోజన గూర్చి వివరించారు. క్షయ వ్యాధి నివారణ ప్రతి ఒక్క పౌరుడు తమ వంతు బాధ్యతగా గుర్తించినప్పుడే వ్యాధిని నిర్మూలించడం సాధ్యమవుతుందని, క్షయ రహిత సమాజ నిర్మాణానికి ప్రజలు సహకరించాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పొనకంటి చిన్న వెంకట్,హెచ్ ఈ హెచ్ వెంకటేశం, ఉష, యల్ టి నవకాంత్, ఏ ఎన్ ఎం విజయ కుమారి, మరియు ఆశాలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## యునిసెఫ్ వారి ఆధ్వర్యంలో అశ్వాపురం పంచాయతీలో రెండవ మహిళా సభ




అశ్వాపురం మండలం (ప్రజా పాలన) : అశ్వాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ శ్రీమతి బానోత్ శారద అధ్యక్షతన %ఖచీ×జజుఖీ%వారి ప్రాజెక్ట్ లో భాగంగా రెండవ మహిళా సభను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఈ క్రింది అంశాలు చర్చించడం జరిగింది..పారిశుధ్యం, త్రాగునీరు, వీధిదీపాల నిర్వహణ, అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణ, హరితహారం, విద్య, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ కార్యక్రమాల పై చర్చించడం జరిగింది. మహిళలకు పురుషులతో సమానంగా లిసమాన అవకాశా లు కల్పిస్తూ మహిళా సభలు నిర్వహిస్తూ అందులో మహిళలను ఎక్కువ సంఖ్య లో హాజరు అయ్యేలా ప్రోత్సాహించాలని, మహిళలు ఆర్థిక స్వావలంబనదిశగా అడుగులు వేసేలా స్వయం సహాయక సంఘాలద్వారా రుణాలు తీసుకొని లిమహిళా సాధికారతలి సాధించాలని, లిబడ్జెట్లో, అభివృద్ధి కార్యక్రమాల అమలు,వేతనాలలో పురుషులతో సమాన వాటాలి ఇచ్చి గ్రామ పంచాయతీ ని జెండర్ ఫ్రెండ్లీ ( లింగ స్నేహ పూర్వక )గ్రామ పంచాయతీలి గా మన అశ్వాపురం గ్రామ పంచాయతీని తీర్చిదిద్దుటకు అవసరమగు అన్ని చర్యలు తీసుకోవాలని, ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరడమైనది. అదేవిధంగా లిమహిళలకు, బాలలకు గల ప్రభుత్వ పధకాలు , చట్టాల అమలు - లోపాలుగురించి చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎంపీపీ శ్రీమతి ముత్తినేని సుజాత,ఎంపీడీఓ శ్రీ వరప్రసాద్, ఎంపీవో శ్రీ శ్రీనివాస్, వైస్ సర్పంచ్ శ్రీ చందూలాల్,ఎంపీటీసీ శ్రీమతి గంగా భవాని,వార్డ్ మెంబర్ శ్రీమతి రాధిక,%×=హీూ% పరిశీలకులు శ్రీ సంపత్, శ్రీ ఈశ్వర్,%×జఖూ% సూపర్వైజర్ శ్రీమతి ధనలక్ష్మి, హెల్త్ సూపర్వైజర్ శ్రీమతి సుందరి,పంచాయతీ కార్యదర్శి శ్రీ కృష్ణ చైతన్య, %×ఖూజజ% శ్రీమతి రాధారెడ్డి,%ూచీవీ% లు, అంగన్వాడీ టీచర్స్, ఆశా కార్యకర్తలు, %హెం+% గ్రూపు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## బూర్గంపాడు మండలంలో జిల్లా విద్యా శాఖ అధికారి ఆకస్మిక తనిఖీ .



బూర్గంపాడు మండలం( ప్రజా పాలన) :.భద్రాద్రి జిల్లా బూర్గంపాడు మండలం లో జిల్లా విద్యాశాఖ అధికారి ఈ సోమశేఖర శర్మ ఈ రోజు ఎంపీపీ ఎస్ పోలవరం, పిఎస్ నకిరి పేట ,యుపిఎస్ టేకుల చెరువు పాఠశాలను సందర్శించడం జరిగింది. సందర్శనలో భాగంగా %ఖీూచీ% ను వివరించడం జరిగింది. మరియు పోలవరం పాఠశాలలో %ఖీూచీ% సరిగా ఇంప్లిమెంట్ లేనందున ఇద్దరు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు ఇవ్వమని మండల విద్యాశాఖ అధికారిని ఆదేశించడం జరిగినది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలు ఎలా చదువుకుంటున్నారు అని, వారిని అడిగి తెలుసుకోవడం జరిగినది. ఈ సందర్శనలో సెక్టోరల్ ఆఫీసర్ సై దులు మరియు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు %ఖ%.వెంకటేశ్వర్లు పాల్గొనడం జరిగింది.

## భద్రాచలం శ్రీ రాముడిని దర్శించుకున్న బీజాపూర్ శాసనసభ్యులు విక్రమ్ మండవి



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం (ప్రజా పాలన.):జాపూర్ శాసనసభ్యులు విక్రమ్ మండవి జి మరియు జెడ్పీ చైర్మన్ శంకర్ కుడియా బీజాపూర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు లాలు లాటూర్ జడ్పీ వైస్ చైర్మన్ మరి కొంత మంది కౌన్సిల్ సభ్యులు కాంగ్రెస్ నాయకులు తో కలిసి భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారినీ దర్శించుకున్నారు. ఈ కార్యక్రమానికి అశ్వాపురం మండలం కాంగ్రెస్ పార్టీ తరఫున వారికి సాదరంగా ఆహ్వానం పలికి దర్శనం చేపించి శాలువాలతో సత్కరించి తేనేటి విందు ఇచ్చి పంపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు గాదే కేశవరెడ్డి ,నియోజకవర్గ యువజన నాయకులు బట్ట విజయ గాంధీ ,సొసైటీ వైస్ చైర్మన్ గాదె వెంకటరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఓరుగంటి బిక్షమయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జన చైతన్య సైకిల్ యాత్రను ప్రారంభించిన ప్రభుత్వ విప్ పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు



బూర్గంపాడు మండలం ( ప్రజా పాలన.) మునుగోడు ఉప ఎన్నికలలో‌‌‌–ార్టీ (టిఆర్ఎస్) అభ్యర్థిగా పోటీ చేస్తున్న శ్రీ కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి గెలుపు కోసం భద్రాచలం పట్టణానికి చెందిన తుడిక ప్రసాద్ పార్టీ గెలుపు కోసం చేపట్టిన జన చైతన్య సైకిల్ యాత్రను ప్రారంభించిన. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ శ్రీ రేగా కాంతారావు . ఈరోజు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ పినపాక శాసనసభ్యులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీ రేగా కాంతారావు శుక్రవారం నాడు మునుగోడు ఉప ఎన్నికలలో పార్టీ అభ్యర్థి శ్రీ కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి గెలుపుకై పార్టీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై ఉన్న అభిమానంతో భద్రాచలం పట్టణానికి చెందిన పార్టీ నాయకులు తుడిక ప్రసాద్ చేపట్టిన జన చైతన్య సైకిల్ యాత్రను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ శ్రీ రేగా కాంతారావు ప్రారంభించారు, ఈ సందర్భంగా అతని అభిమానానికి అభినందనలు తెలిపారు,ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ శ్రీ రేగా కాంతారావు మాట్లాడుతూ... దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాలు తెలంగాణ రాష్ట్రంలో అమలు అవుతున్నాయని, ఈ దేశంలో 75 సంవత్సరాల కానీ అభివృద్ధి ఈ ఎనిమిది సంవత్సరాల కాలంలోనే అభివృద్ధి జరిగిందని, ప్రతి రైతుకు సంవత్సరానికి 10000 వేల రూపాయలు సీఎం కేసీఆర్ ప్రభుత్వం ఇస్తుందన్నారు. రైతు ఏ విధంగా అయినా చనిపోతే 10 రోజులలో ఐదు లక్షల రూపాయలు రైతు బీమా ఇచ్చి ఆదుకుంటున్న ప్రభుత్వం సీఎం కేసీఆర్ ప్రభుత్వం అని తెలియజేశారు., ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సొంత రాష్ట్రమైన గుజరాత్ లో 600 రూపాయలు పెన్షన్లు ఇస్తుంటే, తెలంగాణలో వృద్ధాప్య పెన్షన్ 2016 రూపాయలు, వికలాంగుల పెన్షన్ 3016 ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమని, గుజరాత్ రాష్ట్రంలో 12లక్షల 50వేల మందికి పెన్షన్ ఇస్తుంటే భారతదేశంలోని 46 లక్షలు మందికి పెన్షన్లు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమని, నిరుపేద ఆడబిడ్డలకు కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకం ద్వారా లక్షా 116 వేల రూపాయలు ఇస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్నారు. మునుగోడు ఉప ఎన్నికలలో %దీ=ూ% పార్టీ (టిఆర్ఎస్) శ్రీ కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలవడం ఖాయమని ఆయన స్పష్టం చేశారు.

## దివ్యాంగులకు 50 శాతం రాయితీతో బస్సు పాసులు

**డిపో మేనేజర్ బి మహేష్ కుమార్**



వికారాబాద్ బ్యూరో 14 అక్టోబర్ ప్రజా పాలన : దివ్యాంగులు ప్రభుత్వ ఆసుపత్రి నుండి సదరన్ ధ్రువీకరణ పత్రంతో వచ్చిన వారికి 50 శాతం రాయితీతో బస్ పాసులు ఇవ్వబడునని వికారాబాద్ డిపో మేనేజర్ బి మహేష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 శాతం రాయితీతో సంవత్సరం పొడుగునా బస్సులో ప్రయాణం చేయొచ్చని, అదేవిధంగా అంధులకు వారితో పాటు ఒక అటెండర్ కు కూడా 50 శాతం రాయితీతో బస్సుల్లో ప్రయాణం చేసే అవకాశం కలదని వివరించారు. కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ బి.మహేష్ కుమార్ సూచించారు. స్కూల్ పిల్లల కొరకు ఉచిత బస్ పాస్ ల గడువు ఈ నెల 31 వరకు పొడిగించబడినదన్నారు. బస్ పాస్ తీసుకోని విద్యార్థిని విద్యార్థులు ఎవరైనా ఉంటే చేవెల్ల వికారాబాద్ మోమిన్పేట్ బస్టాండ్ లలో ఉన్న కౌంటర్లలో బస్ పాసులు పొందగలరని స్పష్టం చేశారు. వివాహాది శుభకార్యములకు ఆర్టీసీ బస్సులు అద్దెకు ఇవ్వబడునని చెప్పారు. డిపాజిట్ లేకుండా తక్కువ ధరకే అద్దెకు ఇవ్వబడును అని డిపో మేనేజర్ మహేష్ కుమార్ తెలిపారు. ఆర్టీసీలో సురక్షితమైన ప్రయాణాన్ని అందించడానికి అనుభవజ్ఞులైన డ్రైవర్లు ఉంటారని భరోసా ఇస్తున్నారు. పెళ్లిళ్లకు ఆర్టీసీ బస్సులనే బుక్ చేసుకోవాలి కోరారు.

## అసెంబ్లీ సీట్ల పెంపు.. జాప్యం వెనుక కథేంటంటే..!

హైదరాబాద్, అక్టోబరు 14, :ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలోని అనేక అంశాలకు సంబదించి ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య విభేదాలున్నాయి. రాష్ట విభజన జరిగి ఎనిమిదేళ్ళు అయినా ఇంకా తెలుగు రాష్టాల మధ్య విబేధాలు అలాగే కొనసాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఐదారు నెలలకు ఒక సారి ఉభయ రాష్ట్రాల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తోంది. విబేధాల పరిష్కారం కోసం కేంద్ర హోం శాఖ పరిధిలో ఏర్పాటైన కమిటీ చర్చలు జరుపుతోంది. అయినా ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా విబేధాలు పరిష్కారం కావడం లేదు.సమస్యలు ఎక్కడ ఉన్నాయో అక్కడే ఉన్నాయి. ప్రతి సారి చర్చల చివరాఖరులో ఉభయ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, అధికారులు కలిసి కూర్చొని సమస్యలు పరిష్కరించుకోండని కేంద్ర ప్రభుత్వం పెదరాయుడు తరహాలో ఉచిత సలహా ఒకటి ఇచ్చి చేతులు దులుపు కుంటుంది. రాష్ట్ర ప్రభుత్వాలు ఆ ప్రయత్నం చేయవు. ముఖ్యమంత్రులు మాట్లాడుకోరు.అధికారులు కలుసుకోరు. ఒకరిపై ఒకరు విమర్శలు అయితే చేసుకుంటారు.ఇద్దరు కలిసి కేంద్రంపై నెపం వేస్తారు. కేంద్ర ప్రభుత్వం తాంబూలాలు ఇచ్చేశాం తన్నుకు చావండని తమాషా చూస్తుంది. గడచిన ఎనిమిదేళ్ళుగా ఇదే కథ. ఇలాగే నడుస్తోంది. అయితే అన్ని విషయాల్లో ఎలా ఉన్నా ఉభయ తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు అసెంబ్లీ సీట్ల పెంపు విషయంలో మాత్రం ఏకాభిప్రాయంతో ఉన్నాయి. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం రెండు రాష్ట్రాల్లోనూ అసెంబ్లీ నియోజక వర్గాలను సంఖ్యను పెంచాలని సూచించింది. విభజన చట్టంలోని సెక్షన్ 26లో ఆంధ్ర ప్రదేశ్ లో 175 అసెంబ్లీ సీట్లను 225కి, తెలంగాణలోని 119 సీట్లను 153కి పెంచాలని స్పష్టంగా పేర్కొంది. అయితే, కేంద్ర ప్రభుత్వం తెలుగు రాష్ట్రాలలో అసెంబ్లీ స్థానాలు పెరగాలంటే రాజ్యాంగ సవరణ అవసరమని అంత వరకు రెండు రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్ల పెంపు సాధ్యం కాదని, పదే పదే పార్లమెంట్ సాక్షిగా స్పష్టం చేసింది. విభజన చట్టంలోని సెక్షన్ 15కు లోబడి ఏపీలో 225, తెలంగాణలో 153 స్థానాలకు పెరుగుతాయని, అయితే 2026 వరకు వేచి చూడాల్సిందేనని కేంద్ర మంత్రి గత వర్షాకాల సమావేశాల్లో మరో మారు స్పష్టం చేశారు. మరో వంక ఆంధ్ర ప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం రెండు రాష్ట్రాల్లోనూ అసెంబ్లీ నియోజక వర్గాలను పెంచాలని కానీ ఇంత వరకూ ఆ ప్రక్రియను మొదలు పెట్టలేదంటూ పర్యావరణవేత్త ప్రొఫెసర్ కె.పురుషోత్తమ్ రెడ్డి సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పురుషోత్తం రెడ్డి పిటిషన్ పై సెప్టెంబర్‌లో విచారణ జరిగింది. ఆ విచారణ సందర్భంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో శాసనసభ నియోజకవర్గాల పెంపుపై కేంద్ర ప్రభుత్వం, తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు, కేంద్ర ఎన్నికల సంఘానికి సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది కేంద్ర ప్రభుత్వం మాత్రం, సుప్రీం నోటీసుకు సమాధానం ఇచ్చేందుకు వాయిదాల మీద వాయిదాలు కోరుతోంది. తాజాగా, మరో మారు సుప్రీం కోర్టు తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్ల పెంపుపై 4 వారాల్లో సమాధానం ఇవ్వాలని కేంద్రానికి ఆదేశాలు జారీ చేసింది. అదలా ఉంటే కేంద్ర ప్రభుత్వం నియోజక వర్గాల పెంపు విషయంలో జమ్మూ కశ్మీర్, ఈశాన్య రాష్టాలకు ఒక విధానాన్ని, తెలుగు రాష్ట్రాలకు మరో పద్దతిని పాటించడం వెనక రాజకీయం ఉందని, ఉభయ తెలుగు రాష్ట్రాల అధికార, ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి.ముఖ్యంగా తెరాస సీట్ల పెంపుకోసం గట్టిగా పట్టుపడుతోంది. సీట్ల సంఖ్య పెరిగితే, ఎన్నికల సమయంలో అసంతృప్తుల సంఖ్యను తగ్గించుకోవచ్చని తెరాస భావిస్తోంది. అయితే సీట్ల పెంపు వలన ఉభయ తెలుగు రాష్ట్రాలలో బీజేపీకి ఎలాంటి ప్రయోజానం కనిపించడం లేదు. అందుకే జమ్మూకశ్మీర్ లో నియోజక వర్గాల పునర్విభజన కమిషన్ ఏర్పాటు చేసి ప్రక్రియ కొనసాగిస్తున్న కేంద్ర ప్రభుత్వం తెలుగు రాష్ట్రాల విషయంలో మాత్రం ససేమిరా అంటోంది. ఏదో ఒక సాకుతో ..మెల్లగా 2026 వరకు నెట్టుకొచ్చే ఆలోచన చేస్తోందని అంటున్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తాజా గడవు లోగా కేంద్ర ప్రభుత్వం ఏమి నిర్ణయం తీసుకుంటుందో చూడవలసి ఉందనీ అంటున్నారు. కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకునే అవకాశాలు తక్కువే అని అంటున్నారు. కేంద్రం సుముఖంగా ఉన్నా జమ్మూ కశ్మీర్ లో నియోజక వర్గాల పునర్విభజన ప్రక్రియ ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్నట్లు సాగుతోంది. అంతే కాదు, సుప్రీ కోర్టు ధర్మాసనం జమ్మూ కశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల కేసులను తెలుగు రాష్ట్రాల కేసుతో కలిపి విచారిస్తోంది. సో .. ఇప్పట్లో తెలుగు రాష్ట్రాలలో అసెంబ్లీ స్థానాల సంఖ్య పెరిగే అవకాశం లేదని, కేంద్ర ప్రభుత్వం పదేపదే చెపుతున్న విధంగా 2026 వరకు ఆగక తప్పదని అంటున్నారు

## ఈనెల 16,17 తేదీలలో తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నాను జయప్రదం చేయండి

**డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్**



బోనకల్, అక్టోబర్ 14 ప్రజా పాలన ప్రతినిధి: భారత ప్రజాతంత్ర యువజన సమైక్య డివైఎఫ్ఐ ఆల్ ఇండియా కమిటీ పిలుపులో భాగంగా కేంద్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేయాలని అక్టోబర్ 16,17 తారీకులలో తాసిల్దార్ కార్యాలయం ముందు జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్ పిలుపునిచ్చారు. స్థానిక బోనకల్ వీర తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల భవనంలో శుక్రవారం మండల అధ్యక్షుడు బానోత్ గోపి అధ్యక్షతన జరిగిన మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. డివైఎఫ్ఐ సెంట్రల్ కమిటీ పిలుపులో భాగంగా ఈనెల 16 17 తారీకుల్లో జిల్లా వ్యాప్తంగా ఉన్న 21 మండల కేంద్రాల్లో తహసిల్దార్ కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వంలో ఖాళీగా ఉన్న పోస్టులకు నోటిఫికేషన్లు వెంటనే విడుదల చేయాలని, ప్రధాని మోడీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ని నెరవేర్చాలని, ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకాలను ఆపాలని, అధిక ధరలను అరికట్టాలని, అర్హులైన ఉద్యోగులందరికీ ఉపాధి అవకాశాలు కల్పించాలని తదితర డిమాండ్స్ తో ఈ ధర్నాలు చేయనున్నట్లు ఆయన తెలియజేశారు. జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని మండల కేంద్రాల్లో ఈ ధర్నాలు జయప్రదం చేయాలని ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలకు యువతకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డివైఎఫ్ ఎ జిల్లా ఉపాధ్యక్షులు సత్తనపల్లి నరేష్, జిల్లా నాయకులు రావులపాటి నాగరాజు, మండల నాయకులు బంక శ్రీను, బాబురావు, నరేష్, బాబు తదితరులు పాల్గొన్నారు.

## బస్తి సంపర్క్ అభినయ్ కార్యక్రమం లో కరపత్రాలు ఆవిష్కరణ




ఇబ్రహీంపట్నం అక్టోబర్ తేదీ 14 ప్రజాపాలన ప్రతినిధి:భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా జాతీయ పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు బస్తి సంపర్క్ అభియాన్ కార్యక్రమంలోభాగంగా శుక్రవారం రోజున భారతీయ జనతా పార్టీ ఎస్సిమోర్చా రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బచ్చిగళ్ల రమేష్ ఆధ్వర్యంలో తుర్కయంజాల్ మున్సిపాలిటీ కూడలి అంబెడ్కర్ జగ్జీవన్ రామ్ విగ్రహాల ఆవరణ లో బస్తి సంపర్క్ అభియాన్ కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి సంబంధించి రంగారెడ్డి జిల్లా ఒక కమిటీని నియమించడం జరిగింది. ఈ కార్యక్రమం లో పాల్గొన్న రాష్ట్ర బిజెపి ఎస్సిమోర్చా సోషల్ మీడియా కన్వీనర్ కొంద్రు పురుషోత్తం మాట్లాడుతూ బస్తి సంపర్క్ అభియాన్ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం కేంద్రం లో గత 8 సంవత్సరాలలో నరేంద్రమోదీ ప్రభుత్వం, ఎస్సి ల అభివృద్ధికి ఏ ఏ సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టింది,తెలంగాణ లో కేసీఆర్ ప్రభుత్వం ఎస్సిలకు ఇచ్చిన హామీలను ఏవిధంగా విస్మరించింది,అనే అంశం పైన దేశ వ్యాప్తంగా 75వేల బస్తీలలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆయన తెలిపారు. అందులో మన తెలంగాణలో 5000 వేల బస్తీలలో రంగారెడ్డి జిల్లాలోని 6 నియోజక వర్గాలలో కనీసం 500 బస్తీలలో కార్యక్రమం నిర్వహించాలని బస్తి సంపర్క్ అభియాన్ కమిటీ నిర్ణయించింది. ఈ కార్యక్రమం లో జిల్లా ఎస్సిమోర్చా ప్రధాన కార్యదర్శి కొండూరి మనోహర్ ,జిల్లా ఎస్సిమోర్చా ఉపాధ్యక్షుడు సదానందం జిల్లా ఎస్సిమోర్చా కోశాధికారి చిత్రం నరేష్, మున్సిపాలిటీ ఎస్సిమోర్చా నాయకులు ముదిగొండ నర్సింహ,ఖానపురం లక్ష్మణ్ మరియన్న తదితరులు పాల్గొన్నారు.

## ట్రస్మా సభ్యులకు ఉత్తమ పురస్కారాలు



మంచిర్యాల టౌన్, అక్టోబర్ 14, ప్రజాపాలన:ట్రస్మా సభ్యులకు ఉత్తమ పురస్కారాలను హైదరాబాదులోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ ప్రాంగణంలో శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్, హైదరాబాద్ వారు విద్యారంగంలో విశిష్ట సేవలు అందించిన వారికి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అవార్డ్స్ తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర హోంశాఖ మాత్యులు మహమూద్ ఆలీ శాసనసభ మాజీ స్పీకర్ మధుసూధనాచారి పాల్గొన్నారు. వారి చేతులమీదుగా ప్రతిష్టాత్మక డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అవార్డ్ తో ట్రస్మా మంచిర్యాల జిల్లా అధ్యక్షులు రాపోలు విష్ణువర్ధన్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏనుగు శ్రీకాంత్ రెడ్డి, జిల్లా కోశాధికారి సురభి శరత్ కుమార్ లను సత్కరించారు. కరోనా విపత్తు కాలంలో జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులను, బోధనేతర సిబ్బందిని నిత్యవసర సరుకులు పంపిణీ చేసి ఆదుకున్నందుకు గాను ఉపాధ్యాయులకు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు అండగా ఉన్నందుకు, విద్యారంగ సమస్యలపై వారు చేస్తున్న నిరంతర కృషి, సేవలను గుర్తించి జిల్లా అధ్యక్షుడు రాపోలు విష్ణువర్ధన్ రావు కు, కరోనా విపత్తు కాలంలో శాన్వి ఈ లెర్నింగ్ ద్వారా రాష్ట్రంలో ఉన్న ప్రైవేటు పాఠశాలకు ఉచితంగా ఆన్లైన్ తరగతులు నిర్వహించినందుకు వారి సేవలను గుర్తించి జిల్లా ప్రధాన కార్యదర్శి ఏనుగు శ్రీకాంత్ రెడ్డి ని, రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా చేస్తున్న సేవలు గ్రామీణ ప్రాంతంలో కొన్ని వేలమందికి ఉత్తమ విద్యను అందించి విద్యార్థుల భవిష్యత్తుకు చక్కటి దిశా నిర్దేశం చేస్తున్నందుకు జిల్లా కోశాధికారి సురభి శరత్ కుమార్ ను సత్కరించారు. అవార్డులు తీసుకున్న వీరిని జిల్లాలోని ప్రముఖులు వివిధ పాఠశాల కరస్పాండెంట్లు ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మ అమరేష్, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి శేఖర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## పరమాత్మ కొరకు చేసే ప్రతి పని మోక్షమార్గం: ప్రధాన వక్త గొల్లపల్లి అంజిరెడ్డి



వికారాబాద్ బ్యూరో 14 అక్టోబర్ ప్రజాపాలన : పరమాత్మ కొరకు చేసే ప్రతి పని మోక్షమార్గానికి సుగమమవుతుందని ప్రధాన వక్త గొల్లపల్లి అంజిరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని శివరాంనగర్ కాలనీలో సంతోషిమాత ఆలయం వ్యవస్థాకులు కీ.శే.మోనిగారి నారాయణ దంపతులు, పండరినాథ్, శ్రీనివాస్, రమేష్ ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 28వ వార్షికోత్సవానికి ముఖ్య అతిథులుగా గొల్లపల్లి అంజిరెడ్డి, నాగభూషణం, రఘునాథ్ పంతులు, కళ్యాణ రావు, రాంపంతులు హాజరయ్యారు. సంతోషిమాత ఆలయం అర్చకులు వెంకటరమణాచారి ( బోజయ్య ) నవీన్ పంతులు ఆధ్వర్యంలో ఉదయం ఐదు గంటలకు సుప్రభాతం, ఉదయం ఎనిమిది గంటలకు పుణ్యా హవచనం సంతోషిమాతకు అభిషేకం కుంకుమార్చన, ఉదయం 9 గంటలకు భగవద్గీత విష్ణు సహస్ర హనుమాన్ చాలీసా పారాయణము 12 గంటలకు మహా మంగళహారతి ప్రసాద వితరణ వంటి పూజా కైంకర్యాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నమస్తే దేవదేవేశి నమస్తే కరుణానిధే-సంతోషిణి నమస్తేస్తు నమస్తే జగదీశ్వరీ. ఎక్కడైతే స్త్రీలు గౌరవించి ఆదరింపబడుతారో అక్కడ సిరి సంపదలతో సుఖ సతోషాలతో ఆ గడ్డ పరిఢవిల్లుతుందని స్పష్టం చేశారు. మహిళా మణులు అందరూ సంతోషిమాతను భక్తి ప్రపత్తులతో కొలిస్తే వారి కుటుంబం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని చెప్పారు. నేటి యాంత్రిక జీవితానికి ఆధ్యాత్మిక చింతన అత్యంత ఆవశ్యకమని పేర్కొన్నారు. పండుగకో పబ్బానికో ఒకసారి మహిళలంతా ఒకే దగ్గరికి చేరి ఆధ్యాత్మిక చింతన గురించి ఆలోచించడం ముదావహమని కొనియాడారు. సంతోషిమాత వార్షికోత్సవాన్ని సుఖ సంతోషాలతో జరుపుకొనుటకు పెద్ద సంఖ్యలో వచ్చిన మహిళలందరికీ అభివందనాలు. కీర్తిశేషులు మోని గారి నారాయణ ఏ సందర్భంలోనైతే సంతోషిమాత ఆలయాన్ని నిర్మించిన ఆశయాన్ని నెరవేరుస్తున్న వారి సంతానమైన మోని గారి పండరినాథ్ మోని గారి శ్రీనివాస్ మోని గారి రమేష్ అభినందనీయులని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుల్లపల్లి రమేష్ కుమార్ మాలే లక్ష్మణ్ గుప్తా మహిళలు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హైకోర్టు అసిస్టెంట్ సముద్ర రమేష్ కు శుభాకాంక్షలు తెలిపిన రాజు



ఇబ్రహీంపట్నం అక్టోబర్ తేదీ 14ప్రజాపాలన ప్రతినిధి:సముద్రాల రమేష్ తెలంగాణా హైకోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ గా నియమితులయ్యారు..హర్షం వ్యక్తం చేసిన లయన్ కె.వి. రమేష్ రాజు. ఈ సందర్భంగా మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి సత్కరించిన లయన్ కేవి. రమేష్ రాజు.

## తన సొంత ఖర్చుతో రోడ్డు మరమ్మతులు చేయించిన సర్పంచ్



ఇబ్రహీంపట్నం అక్టోబర్ తేదీ 14ప్రజాపాలన ప్రతినిధి :ఇబ్రహీంపట్నం మండలం పరిధిలోని ఇబ్రహీంపట్నం చెరువు నిండి అలుగు మారుతున్న సందర్భంలో ఉప్పరిగుడ సేరిగుడ రాకపోకలకు ఆటంకం కలుగుతుంది తెలుసుకొని ఉప్పరిగుడా సర్పంచ్ బూడిద రాంరెడ్డి ఉప్పరగూడ నుండి మంగళపల్లి రోడ్డు మరమ్మతులు తన సొంత ఖర్చుతో చేయించడం జరిగింది గ్రామ పంచాయతీ ప్రజలకు వాహనాలకు అంతరాయం లేకుండా ప్రజలే ఇబ్రహీంపట్నం పోయి వచ్చే సౌకర్యాలు కల్పించారు గ్రామస్తులు వారికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## కవ్వాల్ అభయారణ్యంలో సఫారీ పునః ప్రారంభం



జన్నారం, అక్టోబర్ 14, ప్రజాపాలన: మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కవ్వాల్ టైగర్ రిజర్వ్ అభయారణ్యంలో ఈ నెల 16 నుంచి ఆటవీ సఫారీ పునఃప్రారంభమవుతుందని మండల ఆటవీ ఆధికారి సిరిపురం మాధవరావు తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆరన మాట్లాడుతూ కవ్వాల్ అభయారణ్యంలో ఆటవీ ప్రాంతంలో విహార పర్యాటక క్షేత్రాలు, ప్రకృతి రమణీయ గార్డెన్లు, అటవీ జంతువుల పార్క్, సుందరమైన ప్రాంతాలు వున్నాయని అయన వివరించారు. ఈ కవ్వాల్ అభయారణ్యం ప్రకృతి అందాలను తిలకించడానికి అనేక ప్రాంతాలనుంచి, వివిధ రాష్రాల నుంచి పర్యాటకులు ఎక్కువగా తరలి వస్తారని అయన పేర్కొన్నారు. ఐతే ఈ అవకాశం పర్యాటకులు వినియ్యోగించుకోవాలని అయన తెలిపారు.

## యేదేచ్ఛగా కొనసాగుతోన్న అక్రమ పేలుడు పదార్థాల వ్యాపారం

ప్రజాపాలన: కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండల కేంద్రం గా అక్రమ పేలుడు పదార్థాల వ్యాపారం యేదేచ్ఛగా కొనసాగుతోంది. ఈ మండల కేంద్రం ఉత్తర తెలంగాణ అక్రమ వ్యాపారులకు కేంద్రబిందువుగా ఉంది. ఈ మండల కేంద్రం లోని పోలీస్ స్టేషన్ లో ఇదివరకే కొందరు వ్యాపారులపై ఈ అక్రమ పేలుడు పదార్థాల కేసులు ఉండటం విదితమే. ఈ యొక్క మండల కేంద్రం కరీంనగర్ వరంగల్ రాహదారి ని ఆనుకొని ఉండటము ఈ అక్రమార్కులకు కలిసొచ్చే అంశము. గతం లో ఇక్కడనుంచి కొన్ని సంఘవిద్రోహక శక్తులకు ఈ పేలుడు పదార్థాలను చేరవేసినట్టు పోలీసులు లు అనుమానిస్తున్నారు ఇక్కడనుంచే హుస్నాబాద్ హుజూరాబాద్ సుల్తానాబాద్ ప్రాంతాలకు ఈయొక్క పేలుడు పదార్థాల ను ఇక్కడనుంచి రావణచేస్తున్నట్లు అనుమానాలు ఉన్నాయి. ఈ మండల కేంద్రంలో నే ఈ యొక్క పేలుడు పదార్థాలు డంప్ చేసుకొని ఇక్కడనుంచి సప్లయి చేస్తున్నారనీ వినికిడి. ఇప్పటికైనా జిల్లా పోలీసులు ఉన్నతాధికారులు స్పందించి తాగు చర్యలు తీసుకోవాల్సిందిగా వివిధ గ్రామల ప్రజలు కోరుతున్నారు.

## క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయి:

**జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు**



మధిర రూరల్ అక్టోబర్ 14 (ప్రజా పాలన ప్రతినిధి) క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల రాజు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామంలోని మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ గురుకుల కళాశాలలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రీడలను ఆయన ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఆయన కోరారు.బడుగు బలహీన వర్గాలకు మెరుగైన విద్య అందించాలని ముఖ్యమైన లక్ష్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో గురుకుల పాఠశాలలను, కళాశాలను ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుష్మ టిఆర్ఎస్ మండల అధ్యక్షులు రావూరి శ్రీనివాసరావు కూనా నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు



# ఆ తేదీ కోసం ప్రభాస్ ఫ్యాన్స్ ఎదురు చూపులు



యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా ఇప్పటికే చాలా సినిమాలు తెరకెక్కుతున్నాయి అవి కాకుండా కొత్తగా మారుతి దర్శకత్వంలో ఒక సినిమా ను ప్రభాస్ చేయబోతున్నట్లుగా చాలా రోజులుగా వార్తలు వస్తున్నాయి. ఆ సినిమాకు సంబంధించి ఇప్పటి వరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన రాలేదు. కానీ అందుకు సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయని అనధికారికంగా దర్శకుడు మారుతి మొదలుకొని చిత్ర యూనిట్ సభ్యులు పలువురు చెప్పుకొచ్చారు. ప్రభాస్ సన్నిహితుల నుండి అందుతున్న తాజా సమాచారం ప్రకారం ఈ నెల 17వ తారీఖున సినిమా యొక్క పూజా కార్యక్రమాలు లాంఛనంగా జరగబోతున్నాయట. అంతే కాకుండా ఈ నెలలో మూడు రోజుల పాటు సినిమాకు సంబంధించిన షూటింగ్ కార్యక్రమాల్లో కూడా ప్రభాస్ పాల్గొనబోతున్నట్లుగా తెలుస్తోంది. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ లో ఈ సినిమా నిర్మాణం జరగబోతుందని ఇప్పటికే మీడియా వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. ఇక ఈ సినిమాలో హీరోయిన్స్ గా నిధి అగర్వాల్ మరియు మాళవిక మోహన్ లు నటించబోతున్నారు. వీరిద్దరు కాకుండా మరో హీరోయిన్ కూడా ఈ సినిమాలో ఉండే అవకాశం ఉందని మారుతి సన్నిహితుల ద్వారా సమాచారం అందుతుంది. ఇప్పటి వరకు వచ్చిన వార్తలన్నింటికీ అక్టోబర్ 17వ తారీఖున సమాధానం లభించే అవకాశం ఉందని ప్రభాస్ అభిమానులు ఎదురు చూస్తున్నారు. కొంత మంది ప్రభాస్ అభిమానులు ఆ మధ్య మారుతి దర్శకత్వంలో ప్రభాస్ సినిమా వద్దు అంటూ బాయ్కాట్ నినాదాన్ని ఎత్తుకున్నారు. కానీ ప్రభాస్ ఇప్పటికే కమిట్ అయ్యాడు కనుక సినిమాను చేయాల్సిందే అని నిర్ణయించుకున్నాడు. రాజా డీలక్స్ అనే టైటిల్ని మొదట అనుకున్నారు.. కానీ పాన్ ఇండియా రేంజ్ లో టైటిల్ ఉండాలనే ఉద్దేశంతో మరో టైటిల్ పరిశీలించే పనిలో దర్శకుడు మారుతి ఉన్నాడట. అక్టోబర్ 17 కోసం ప్రభాస్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తూ ఉంటారు. ఆరోజు మరిన్ని విషయాలు తెలిసే అవకాశం ఉందేమో చూడాలి.

# 30 ఏళ్ల కల 'మా' సొంత భవనం ఈసారి అస్సామే!



'మా' (మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్) సొంత భవనం నిర్మించుకోవాలన్నది 30 ఏళ్ల నాటి కల. ఇప్పటివరకూ ఎంతో మంది అధ్యక్షులుగా పనిచేసారు. కానీ ఏ ఒక్కరూ సొంత భనవం నిర్మించింది లేదు. సరిగ్గా ఏడాది క్రితం ఇదే ఏజెండాతో మంచు విష్ణు ఎన్నికల బరిలోకి దిగి గెలిచారు. తనని అధ్యక్షుడిగా గెలిపిస్తే సొంత డబ్బుతో 'మా 'భవనాన్ని నిర్మిస్తానని...ఒక్క పైసా కూడా అసోసియేషన్ నుంచి తీసుకోకుండా అన్ని తానై ముందు నిలబడి ఆ పని పూర్తి చేస్తానని వాగ్దానం చేసారు. వీలైనంత త్వరగా భవనం ఏర్పాటు చేసి తన బాధ్యత నెరవేస్తానని ప్రామిస్ చేసారు. మరి ఇప్పుడా ఒట్టు తీసి గట్టు మీద పెట్టారా? 'మా' సొంత భవనం ఈ టెర్మ్ కూడా సాధ్యం కాదా? అంటే అవుననే తెలుస్తోంది. అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అధ్యక్షుడు మంచు విష్ణు చేసిన వ్యాఖ్యల్ని బట్టే భవనం ఇప్పట్లో సాధ్యం కాదని గుసగుసలు మొదలయ్యాయి. ఇప్పుడున్న ఛాంబర్ కి 20 నిమిషాల ప్రయాణ దూరంలో విష్ణు ఓ కొత్త భవనం చూసారుట. కానీ సభ్యులు అంత దూరం వెళ్లడం కన్నా ఛాంబర్ కూల్చివేత తర్వాత కొత్త భవనం ఇక్కడే ఏర్పాటు చేసుకుందామని అనడంతో విష్ణు వాళ్ల మాటకే కట్టుబడి నట్లు తెలిపారు. అయితే ఇది జరగడానికి కనీసం మూడు..నాలుగేళ్లు సమయం పడుతుందని అన్నారు. ఆ కార్యాలయానికి ఎన్ని కోట్లు ఖర్చు అయినా తానే భరిస్తానని మరోసారి విష్ణు మాటిచ్చారు. ఎన్నికలకు ముందు చెప్పినవన్నీ పూర్తిచేసానని ..భవనం ఒక్కటే పెండింగ్ ఉందన్నారు. అలాగే 20 నిమిషాల దూరంలో ఉన్న భవనం ఉందని చెప్పారు తప్ప.. అది సొంత భవనమా? అద్దెకు తీసుకున్నారా? అన్నది క్లారిటీ ఇవ్వలేదు. ఒకవేళ సొంత భవనమే అయితే 20 నిమిషాల జర్నీ కూడా చేయలేని పరిస్థితుల్లో ఆర్టిస్టులు ఉన్నారా? అన్నది మరో సందేహంగా తెరపైకి వస్తోంది. ఆ రకంగా 'మా' సొంత భవనం ఇప్పట్లో తేలేది కాదని...విష్ణు వ్యాఖ్యలు సాధారణ నాయకుడి మాటల్ని తలపిస్తున్నాయని ఆయన వ్యతిరేక వర్గం అభిప్రాయపడుతుంది. గెలవడం కోసమే సొంత భవనం ఎర వేసి గెలిచాడని ఎద్దేవా చేస్తున్నారు. అలాగే 'మా' లో ప్రక్షాళన కూడా విడ్డూరంగానే ఉందని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కొత్త నిబంధనలతో సభ్యులకు ఇబ్బందులు తప్పవని విమర్శలొస్తున్నాయి.

# సింధూర పుష్పాన్ని చేజిక్కించుకున్న విక్కీ



కత్రినా కైఫ్ - విక్కీ కౌశల్ గత సంవత్సరం డిసెంబర్ లో తమ వివాహానంతరం మొదటి కర్వా చౌత్ ను జరుపుకుంటున్నారు. బాలీవుడ్ లోని చాలా మంది జంటల మాదిరిగానే కత్రినా- విక్కీ కూడా వారి తల్లిదండ్రులతో పాటు సాంస్కృతిక ఆచారాలలో పాల్గొన్నారు. తాజాగా లవ్ బర్డ్స్ ఇద్దరూ తమ తమ సోషల్ మీడియాల్లో కర్వా చౌత్ వేడుకల నుంచి సంతోషకరమైన ఫోటోలను అభిమానులు అనుచరుల కోసం షేర్ చేసారు. కర్వా చౌత్ వేడుక నుండి అందమైన ఫోటోలను ఇన్ స్టాగ్రామ్ లోకి రాగానే ప్రస్తుతం అవి వైరల్ గా మారుతున్నాయి. ఈ జంట ప్రత్యేక సందర్భం కోసం అద్భుతమైన సంప్రదాయ దుస్తులను ధరించారు. విక్కీ గోల్డెన్ థ్రెడ్ వర్క్ తో కూడిన తెల్లటి కుర్తాను ధరించి వైట్ ప్యాంటుతో స్టైల్ గా కనిపంచాడు. మరోవైపు కత్రినా ప్రింటెడ్ బ్లౌజ్ తో అందమైన ఎరుపు రంగు చీరను ధరించి పూర్తిగా తేజోవంతంగా కనిపించింది. కాంబినేషన్ గా ఎరుపు రంగు గాజులు-చెవిపోగులు మంగళసూత్రంతో అలంకరించి కనిపించింది. విక్కీ - కత్రినా ఒకరితో ఒకరు పోజులివ్వడమే కాకుండా తమ తల్లిదండ్రులతో కలిసి ఒక ఫోటోకి ఫోజులిచ్చారు. ఫోటోలను షేర్ చేస్తూ కత్రినా ఈ పోస్ట్ కి "పహలా చకర్వాచౌత్ (నక్షత్రాలతో కూడిన ఎమోజి)" అని క్యాప్షన్ ఇచ్చింది. కత్రినా -విక్కీ జంట గత సంవత్సరం డిసెంబర్ 9 న రాజస్థాన్ లోని సిక్స్ సెన్సెస్ ఫోర్ట్ బార్వారాలో వివాహం చేసుకున్నారు. పెళ్లి.. ప్రీ-వెడ్డింగ్ ఉత్సవాల నుండి ఫోటోగ్రాఫ్స్ వీడియోలు సోషల్ మీడియాల్లో వరల్ అయ్యాయి. పెళ్లికి ముందు ఈ జంట తమ సంబంధం గురించి బహిరంగంగా ఎప్పుడూ మాట్లాడలేదు. కరీర్ మ్యాటర్ కి వస్తే... విక్కీ- కత్రినా ఇద్దరూ ఆసక్తికరమైన లైనప్ ను కలిగి ఉన్నారు. విక్కీ ప్రస్తుతం గోవింద నామ్ మేరా చిత్రంలో కనిపించనున్నారు. సారా అలీ ఖాన్ తో లక్ష్మణ్ ఉటేకర్ మూవీ చేస్తున్నాడు. ఈ మూవీ కి టైటిల్ నిర్ణయించలేదు. సామ్ బహదూర్ మూవీతో పాటు.. ఆనంద్ తివారీ తదుపరి చిత్రంలోను నటించనున్నారు. మరోవైపు కత్రినా 'ఫోన్ భూత్' విడుదలకు సిద్ధమవుతోంది. మెర్రీ క్రిస్మస్- టైగర్ 3లోనూ నటిస్తోంది. సల్మాన్ ఖాన్ సరసన టైగర్ 3 చేస్తుండగా.. ప్రియాంక చోప్రా - అలియా భట్లతో కలిసి ఫర్హాన్ అక్తర్ జీ లే జరాలో నటించనుంది.

# పోకిరి డేట్ మిస్ చేసుకున్న మహేష్



సెంటిమెంట్ పరిశ్రమలో రిలీజ్ డేట్ అనేది చాలా ఇంపార్టెంట్. సరైన సమయం సందర్భం ముహూర్తం చూసుకోనిదే రిలీజ్ తేదీని నిర్మాతలు ప్రకటించరు. అలాగే హీరోలు తమ కెరీర్ లో బ్లాక్ బస్టర్ చిత్రాల రిలీజ్ తేదీలను సెంటిమెంటుగా భావిస్తుంటారు. అయితే ఇప్పుడు అలాంటి ఒక అరుదైన అవకాశాన్ని సూపర్ స్టార్ మహేష్ మిస్ చేసుకుంటున్నారు. మహేశ్బాబు-త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్ మూవీని పోకిరి రిలీజ్ తేదీకి తీసుకువస్తారని అంతా భావించారు. 28 ఏప్రిల్ 2023న 'పోకిరి' విడుదల తేదీనే మా చిత్రాన్ని విడుదల చేస్తామని మేకర్స్ ప్రకటించారు. కానీ ఆశించినది జరగడం కష్టంగా కనిపిస్తోంది. డెడ్ లైన్ ప్రకారం ఈ సినిమా షూటింగును పూర్తి చేసే అవకాశం కనిపించడం లేదని గుసగుస వినిపిస్తోంది. అయితే దానికి రకరకాల కారణాలున్నాయి. సినిమా ఆరంభమే కొన్ని చిక్కులు ఎదురయ్యాయి. ఒక భారీ షెడ్యూల్ లో మూవీకి సంబంధించిన యాక్షన్ పార్ట్ మొత్తం పూర్తి చేయాలని త్రివిక్రమ్ ప్లాన్ చేసారు. కానీ యాక్షన్ కొరియోగ్రఫీ విషయంలో మహేష్ బాబు సంతృప్తి చెందకపోవడంతో మొదటి షెడ్యూల్ ను కుదించారు. 10 రోజుల పాటు ప్లాన్ చేసిన ఈ షెడ్యూల్ కేవలం రెండు రోజుల్లోనే పూర్తయింది. రెండవ షెడ్యూల్ అక్టోబర్ 9 న ప్రారంభం కావాల్సి ఉంది. కానీ ఇంతలోనే మహేష్ బాబుకు ఊహించని షాక్ తగిలింది. తన తల్లి గారు ఇందిరా దేవి మరణించారు. ఈ విచార సమయంలో చిత్రబృందం మౌనాన్ని ఆశ్రయించింది. త్రివిక్రమ్ కొత్త షెడ్యూల్ ను ప్లాన్ చేయలేదు. తాజాగా మహేష్ విశ్రాంతి కోసం రెండు మూడు వారాల పాటు విదేశాలకు వెళ్లనున్నాడని సమాచారం. నవంబర్ లో హైదరాబాద్ కు తిరిగి రానున్నారు. అప్పటివరకూ తదుపరి షెడ్యూల్ ని చిత్రీకరించలేరు. కారణం ఏదైనా ముఖ్యమైన సమయం వృధా అయ్యింది. ఏప్రిల్ నాటికి సినిమా పూర్తయ్యే అవకాశం లేదు. 28 ఏప్రిల్ 2023న 'పోకిరి' రిలీజ్ తేదీకి ఈ సినిమాని తేవడం అసాధ్యమని భావిస్తున్నారు. త్రివిక్రమ్ ఎలాంటి మంత్రదండం ఉపయోగించినా ఇది సాధ్యం కాదని విశ్లేషిస్తున్నారు. అతడు-ఖలేజా తర్వాత ఈ కాంబినేషన్ లో వస్తున్న హ్యాట్రిక్ మూవీ ఇది. ఇందులో మహేష్ సాఫ్ట్ వేర్ ఇంజినీర్ గా నటిస్తాడని టాక్ ఉంది. పాన్ ఇండియా ప్రయత్నం కాదు..! మహేష్ తదుపరి రాజమౌళితో భారీ పాన్ ఇండియా సినిమాలో నటించనున్న సంగతి తెలిసిందే.

# సూపర్ స్టార్ స్టైలిష్ లుక్ కి ఫ్యాన్స్ ఫిదా




తమిళ స్టార్ హీరో అజిత్ కుమార్ కి సినిమాలంటే ఎంత ఇష్టమో బైక్ రేసింగ్ అంతకంటే ఇష్టం. తన ప్రతి సినిమాలో కూడా బైక్ రేసింగ్ ఉండాలని ఆసక్తి చూపించే అజిత్ కుమార్ సినిమాల్లో సన్నివేశాలు ఉన్నా లేకున్నా రెగ్యులర్ గా తన సినిమాల షూటింగ్ కోసం బైక్ పై వెళ్లడం జరుగుతుందట. అంతే కాకుండా సుదూర ప్రాంతాలకు బైక్ రైడింగ్ తో అజిత్ కుమార్ వెళ్లడం మనం చూస్తూనే ఉన్నాం. ప్రస్తుతం ఆయన హెచ్ వినోద్ దర్శకత్వంలో ఒక సినిమాను చేస్తున్న విషయం తెలిసిందే. ఆ సినిమా షూటింగ్ గ్యాప్ లో ఇలా సరదాగా తన స్పోర్ట్స్ బైక్ చెక్కర్లు కొడుతున్నాడు .ఆ సందర్భంగా తీసుకున్న ఈ ఫోటో ప్రస్తుతం సోషల్ మీడియా లో వైరల్ అవుతుంది. పెద్ద ఎత్తున ఈ ఫోటో గురించి మీడియాలో జనాలు మాట్లాడుకుంటున్నారు. అంతే కాకుండా సూపర్ స్టార్ అజిత్ కుమార్ స్టైలిష్ లుక్ అద్భుతంగా ఉందంటూ పలువురు కామెంట్స్ చేస్తున్నారు. వరుసగా సక్సెస్ లను దక్కించుకుంటున్న అజిత్ కుమార్ ఈ మధ్య కాలంలో తెలుగులో మాత్రం ఆశించిన స్థాయిలో ఆకటుకోలేక పోతున్నాడు. ఆయన క్రేజ్ పూర్తిగా తమిళ సినీ ప్రేక్షకుల వరకే పరిమితం అవుతుంది. తెలుగులో ఒకప్పుడు మంచి సక్సెస్ లను దక్కించుకున్న అజిత్ కుమార్ ఇప్పుడు మాత్రం ఆ స్థాయి విజయాల కోసం చాలా కాలంగా ఎదురు చూస్తున్నాడు. ప్రస్తుతం చేస్తున్న సినిమాలైనా ఆయనకు తెలుగులో మునుపటి క్రేజ్ ని తెచ్చి పెడతాయా చూడాలి.

# "చై 22" లో కార్తీక దీపం ఫేమ్ దీప కీలక రోల్.!




అక్కినేని నాగ చైతన్య హీరోగా ఇప్పుడు కోలీవుడ్ హిట్ దర్శకుడు వెంకట్ ప్రభు కాంబోలో తెరకెక్కిస్తున్న చిత్రం అందరికీ తెలిసిందే. చైతు కెరీర్ లో 22వ సినిమాగా ఓ కాపీ డ్రామా లా మేకర్స్ అయితే తెరకెక్కిస్తున్నారు. మరి ఈ చిత్రం నుంచి అయితే రోజు పలు ఆసక్తికర అనౌన్సమెంట్ లు రాగా వాటిలో ఒక ఊహించని అనౌన్సమెంట్ కూడా వచ్చింది. మరి ఈ చిత్రంలో మన తెలుగు స్మాల్ స్క్రీన్ దగ్గర బిగ్గెస్ట్ హిట్ సీరియల్ పాత్రధారిణి అయినటువంటి ప్రేమి విశ్వనాథ్ నటిస్తున్నట్టు అనౌన్స్ చేశారు. మరి కార్తీక దీపంలో వంటలక్క గా ఈమెకి ఉన్న క్రేజ్ కోసం ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అలాగే టాలీవుడ్ లో ఇదే తనకి ఫస్ట్ సినిమా కావడం మరింత విశేషంగా అయితే మారింది. మరి ఈ చిత్రంలో ఈమె ఎలాంటి పాత్రలో కనిపిస్తుందో అనేది అందరిలో ఆసక్తిగా మారింది.




Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989